రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త

## 24, 25 తేదీలలో దివ్యాంగుల క్రీడా పోటీలు

**వికారాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:** అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 24,25 తేదీలలో రెండు రోజుల పాటు స్త్రీ,పురుషుల దివ్యాంగులకు క్రీడా పోటీలు స్థానిక బ్లాక్ గ్రౌండ్స్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూఓ లలితా కుమారి మంగ ళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వారు జూనియర్లుగా, 17 సంవత్సరాల నుండి 54 సంవత్సరాల వారు సీనియర్లుగా రెండు విభాగాలలో ఆటల పోటీలు నిర్వహించు న్నట్లు ఆమె తెలిపారు. దృష్టి, వినికిడి, శారీరక, మానసిక, వికలాంగులు ఆటల పోటీలలో పాల్గొనవచ్చని ఆమె తెలిపారు. రన్నింగ్, షాట్ పుట్, చెస్, క్యారమ్స్, వీల్ చైర్స్ జావలిన్ త్రో, ట్రై సైకిల్ రేస్ లాంటి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఆటల పోటీలలో మొదటి రెండో స్థానం సాధించిన వారికి రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు తెలిపారు. ఆటల పోటీలలో జిల్లాకు చెందిన దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

**శంకర్‌పల్లి, నవంబర్ 22, ప్రభాతవార్త :**
శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వికారాబాద్ వైపు వెళ్లే బస్సులు సమయపాలన పాటించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం శంకర్‌పల్లి బస్టాండ్‌లో పలు పాఠశాలల, కళాశాలల విద్యార్థులు బస్టాండ్‌లో ఎన్ఎస్ఓయుఐ రంగారెడ్డి జిల్లా సెక్రటరీ అఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో బైఠాయించి ధర్నా చేపట్టారు. అరకొర బస్సులు, దానికి తోడు సమయపాలన పాటించకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేధన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెట్రో బస్సుల్లో పాసులు అనుమతించాలని, బస్సులు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మండలంలోని ప్రతి గ్రామానికి బస్సులు నడపాలని కోరారు. అధికారులు సమస్యలను తొందరగా పరిష్కరించాలన్నారు. ఈకార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సెక్రటరీ కరుణాకర్‌గౌడ్, చేవెళ్ల నియోజకవర్గం ఉపాధ్యక్షులు ఎజాస్, మండల ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ సంజయ్, మున్సిపల్ ఎన్ఎస్‌యుఐ నాయకులు కిషోర్, అస్లాం, మతిన్, సోయల్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.



# అక్రమణలను తొలగిస్తేనే

# ఓఆర్ఆర్ ఎగ్జిట్ 15 సమస్యకు మార్గం

ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్ 15 వద్ద నిలిచిన నీరు

- నర్సింహ్మా చెరువు తూము తొలగిస్తే మరిన్ని సమస్యలు ఎదురయ్యే ప్రమాదం
- ఈ చెరువు సమస్య జిల్లా మంత్రికి మరిన్ని సమస్యలు సృష్టించనున్నదా...?

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి, హైదరాబాద్, నవంబర్ 22, (ప్రభాతవార్త) :** ఓఆర్ఆర్ రింగ్‌రోడ్డు పరిధిలోని పెద్ద గోల్కొండ ఎగ్జిట్ 15 నెంబర్ గల రహదారి పలు గ్రామాలకు వెళ్లే ఈ దారి నీటిలో మునగడానికి అక్రమ నిర్మాణాలు, కొంత మంది రియాల్టర్లు చెరువు శివారు ప్రాంత భూములన్ని మట్టితో ఐదు ఆరు ఫీట్లు పూర్తిగా నింపివేయడంతో ఈ సమస్య మరింత జఠిలంగా మారిందని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సమస్యను పరిష్కారించవాల్సిన జిల్లా సంబంధిత అధికారులు ఓఆర్ఆర్, హెచ్ఎండీఏ అధికారులు సమగ్ర విచారణ చేయకుండా గత కొన్ని సంవత్సరాలుగా పెద్ద గొల్కొండ ఎగ్జిన్ 15 వర్షం వరద నీరుతో నిండిపోతున్న తాత్కాలిక చర్యలు చేపడుతుండటంతో ఈ సమస్య చిలికి చిలికి గాలి వానగా మారి పెద్ద గొల్కొండ, చిన్న గొల్కొండ గ్రామాల మధ్యన ఉద్రిక్తలకు దారి తీస్తుంది. శంషాబాద్ మండల పరిధిలోని ఓ ఆర్ఆర్ నిర్మాణ సమయంలోనే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో ఇప్పుడు ఈ సమస్య జిల్లా అధికారులకు, ఆయా గ్రామాల మధ్యన రాజకీయ నాయకులకు, రైతులకు, గ్రామస్థుల మధ్యన వివాదాలకు ఓ కారణంగా మారుతుంది. స్థానికంగా కొంత మంది రియాల్టర్లు గత కొన్ని సంవత్సరాల క్రితం వర్షాలు లేకపోవడంతో చిన్న గొల్కొండ నర్సింహ్మా చెరువు శివారుల్లో కొంత మంది రియాల్టర్లు అతితక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి వందలాది టిప్పర్లతో ఐదారు ఫీట్ల ఎత్తు వరకు మట్టిని భారీగా డంపింగ్ చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో చెరువులోకి రావాల్సిన వరద నీరు అంతు వెనక్కి రావడంతో పెద్ద గొల్కొండ ఎగ్జిట్ 15 నెంబర్ బ్రిడ్జి కింద పూర్తి ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత రెండు మూడు సంవత్సరాల క్రితం కూడా వర్షాకాలంలో రహదారి రాకపోకలు నిలిపివేసే సమయంలో జిల్లా అధికారులు, హెచ్ఎండీఏ అధికారులు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టి గాలికి వదిలేశారు. వేసవి కాలంలో శాశ్వతంగా వరద నీరును దారి మళ్లించడంలో హెచ్ఎండీఏ, జిల్లా అధికారులు గోరంగా వైఫల్యం చెందారు. గత కొన్ని నెలలుగా ఎగ్జిట్ నెంబర్‌ను పూర్తిగా మూసివేయడంతో సోషల్ మీడియాలో భారీగా కథనాలు రావడంతో జిల్లా అధికారులు ఏమీ చేయాలేక చేతులు ఎత్తేసి సమస్యను మంత్రి సబితాఇంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆమోయ్‌కుమార్‌లకు అప్పజెప్పారు. దీంతో మంత్రి, కలెక్టర్లు సోమవారం రోజు ఓఆర్ఆర్ పెద్ద గొల్కొండ ప్రాంతాన్ని సందర్శించి అక్కడ సమస్యను సమీక్షించారు. చిన్న గొల్కొండ నర్సింహ్మా చెరువులోని 144 సర్వేనెంబర్ భూమి వెంట నీరును వదులుతామని ప్రకటించారు. అయితే ఈ చెరువు కట్ట కింద వరి సాగు చేసుకుంటున్న చిన్నగొల్కొండ రైతులు గ్రామ పెద్దలు ఈ నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. తమకు నెల రోజుల పాటు వరికోతలు కోసుకోవడంతో పాటు సమయం ఇవ్వాలని కలెక్టర్ దృష్టికి తీసుకుపోవడం జరిగింది.

### మరిన్ని సమస్యలుగా...

పెద్ద గొల్కొండ ఓటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 15 గత కొన్ని నెలలుగా పూర్తిగా నీట మునిగి రాకపోకలు నిలిచిపోవడంతో మండల పరిధిలోని చిన్న గొల్కొండ నర్సింహా చెరువు ప్రధాన సమస్యగా మారింది. ఈ చెరువు చిన్న గొల్కొండ గ్రామ రెవెన్యూ పరిధిలో 144లో విస్తరించి ఉంది. ఈ రహదారి వెంట సుమారు 50 గ్రామాలతో పాటు ఔటర్ రింగ్‌రోడ్డు ఎంట్రెన్స్ కూడ ఉంది. ఎగువ ప్రాంతంలో ఉన్న ఈదులకుంట, బైరమోని చెరువు ద్వార చిన్న గొల్కొండ రెవెన్యూ పరిధిలో ఉన్న నర్సింహా చెరువులోకి ఔటర్ ఎగ్జిట్ 15 నుంచి వెళుతుంది. ముఖ్య కూడలీ అయిన ఈరహదారి ఖరీదైన ప్రదేశంగా మారిపోయింది. దీంతో అక్కడ కొంత మంది సొంత పట్టా భూమి అంటూ సుమారు 5 ఎకరాల భూమిలో ఐదారు ఫీట్ల ఎత్తు మట్టిని పోసి నింపేశారు. దీంతో చెరువు నీటి సామర్థ్యాన్ని కోల్పోయింది. ఈ బ్యాక్ వాటర్‌తో ఓఆర్ఆర్ ఎగ్జిటన 15 రెండు నెలలుగా నీట మునిగి రాకపోకలకు అంతరాం ఏర్పాడింది. దీంతో ఈ సమస్యను పలువురు గ్రామస్థులు, నాయకులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావడంతో రాజేంద్రనగర్ ఆర్డీఓ చంద్రకళ ఓఆర్ఆర్ ఎగ్జిట్ వద్ద సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని చెప్పి వెళ్లిపోయారు. పెద్ద గొల్కొండ ఈధుల కుంట చెరువు పరిదిలో ట్రెండ్ సెట్టర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఎఫ్‌టీఎల్ ఆక్రమించి పెద్ద ఎత్తున వెంచర్ ఏర్పాటు చేసింది. బైరమోని కుంటలో అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగించారు. కానీ నరసింహా చెరువులో చేపట్టిన నిర్మాణాలు మట్టిని తొలగించడానికి అధికారులు ఎలాంటి చర్రయలు తీసుకోవడం లేదు.

### ఒక సమస్యకు మరో పరిష్కారం

ఎగ్జిట్ ముంపుకు గురికావడానికి నర్సింహా చెరువు నిండడానికి ఎలాంటి సంబంధం లేదని స్థానికులు సెలవిస్తున్నారు. చెరువులో మట్టి పోయడం వల్లనే సమస్య ఏర్పడిందని దాని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

### చెరువులో నీరు బయటకు తీయరాదు...

తెలంగాణ ప్రభుత్వం భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చెరువుల నీళ్ల ఎట్టి పరిస్థితుల్లో బయటకు తీయడానికి లేదంటూ ప్రత్యేక జీఓ జారీ చేసింది. కానీ అధికారులు మాత్రం ఈ సమస్యను పరిష్కారించడానికి తూము తీసి సమస్యను పరిష్కారిస్తామని చెపడ్పంతో ఈ సమస్య మరింత జఠిలమవుతుంది.

### తూము తీస్తే ఇతర చెరువులపై మరింత ప్రభావం.

ఒకవేళ అధికారులు చెరువు తూము లేదా అలుగు తీసి నీటిని కిందికి వదిలితే తూముకు ఎదురుగా ఉన్న చిన్న గోల్కొండ పాఠశాల నష్టపోయే ప్రమాదం ఉంది. అలుగు తవ్వితే గ్రామ సమీపం నుంచి నీళ్ల వెళ్లడం రోడ్డు ధ్వంసం కావడం జరుగుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంకా ఎఫ్‌టీఎల్ రెండు మూడు ఫీట్లు పెరిగితే అలుగు పారే అవకాశం ఉంది. అధికారులు సాహసించి ఈ చెరువు తూము తీస్తే దీని యొక్క ప్రభావం ఇతర చెరువుల పైన పడే అవకాశం ఉంది. శంషాబాద్ మండలంలో చెరువులు కబ్జాకు గురయ్యాయి. ప్రైవేటు ల్యాండ్ అంటూ ఆక్రమణలు చేపట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. మహేశ్వరం మండలం పరిధిలోని రావిరాల చెరువు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నట్లు సమాచారం.

### అలుగు తూము పరిశీలించిన మంత్రి, కలెక్టర్

ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ ముంపును పరిష్కారించడానికే అధికారులు మొగ్గ చూపుతుండటం విమర్శలకు తావిస్తున్నాది. రాజేంద్రనగర్ ఆర్డీఓ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, విద్యాశాఖ మంత్రి ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్‌ను మాత్రమే పరిశీలించి అక్కడి నుంచి నిర్ణయాలు తీసుకొని వెళ్లడం జరిగింది. చెరువు తూము చిన్న గోల్కొండ పరిసర ప్రాంతాన్ని పరిశీలించాలని అక్కడ గ్రామస్థులు రైతులు విన్నవించినప్పటికీ పరిశీలించలేదు.



## బస్సు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు

**-మూడు గంటలకు పైగా రోడ్డుపై బైఠాయించి ధర్నా**



మైలార్ దేవరంపల్లి గ్రామంలో ప్రత్యేక బస్సు వేయాలని రోడ్డుపైనే మూడు గంటల పాటు రాస్తారోకో నిర్వహించిన విద్యార్థులు

**కోట్‌పల్లి, నవంబర్ 22,ప్రభాతవార్త :**
కోట్‌పల్లి మండలం నుంచి వికారాబాద్‌కు వేళ్ళేందుకు ఆరకోర ఆర్టీసీ బస్సులతో పాఠశాలలకు, కళాశాలలకు, సరైన సమాయానికి చదువుకోవడానికి వేళ్ళలంటే చేరుకోలేక పోతున్నామని విద్యార్థులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు సరిపోవడం లేదని తరుచూ అధికారుల దృష్టికి తీసుకేళ్తే పట్టించుకోవడం లేదని విద్యార్థులు తీవ్రంగా అవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు సౌకర్యం కోసం ప్రత్యేక బస్సులు వేయాలని మంగళవారం నాడు మైలార్ దేవరంపల్లి గ్రామంలో ఉదయం నుంచి విద్యార్థులు రోడ్డుపైనే రాస్తా రోకో చేశారు. అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించే వరకు బస్సు ఇక్కడి నుంచి కదులనిచ్చేది లేదని రోడ్డుపైనే ధర్నా ముదు గంటల పాటు రోడ్లుపై కూర్చున్నారు. డిపో మేనేజర్ డౌన్ డౌన్ అంటూ విద్యార్థులు నినాధాలు చేశారు. విద్యార్థులకు రాకపోకలకు ఇబ్బందులకు గురి అవుతున్నామని పలుమార్లు అధికారులకు తెలిపిన పట్టించుకునే పాపన పోలేదని విద్యార్థులు తీవ్రంగా అవేదన వ్యక్తం చేస్తున్నారు.డీపో మేనేజర్ స్పందించి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసేదాక కదులేది లేదని రోడ్డుపైనే బైఠాయించారు. అనంతరం పోలీసులు అక్కడి చేరుకోని విద్యార్థులను వారి తల్లిదండ్రులను సమూదాయించే ప్రయత్నం చేశారు.

## కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు

**బొంరాస్‌పేట్,నవంబర్ 22ప్రభాతవార్త :** బొంరాస్‌పేట్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం హైద్రాబాద్‌లోని పీసీసీ అద్యక్షులు,ఎంపీ రేవంత్‌రెడ్డి,కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ తిరుపతిరెడ్డిల సమక్షంలో మండలంలోని గట్టెగాని తండా, నరస్య నాయక తండా,దరికింది తండా,సుండి తుకారాం అద్వర్యంలో టీఆర్ఎస్ పార్టీ నుంచి 50 మంది కార్యకర్తలు కాంగ్రెస్ తీర్దం పుచ్చుకున్నారు.కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలతో పీసీసీ అద్యక్షులు రేవంత్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అద్యక్షులు,పరిగి మాజీ ఎమ్మెల్యే రాంమోహన్‌రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు నర్సిములుగౌడ్,నాయకులు రాంచంద్రదారెడ్డి,రాజేష్‌రెడ్డి,మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్ తదితరులున్నారు.



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన టీఆర్ ఎస్ కార్యకర్తలు

## శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో ఘనంగా కార్తీకమాస పూజలు



తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో కార్తీకమాసం ప్రత్యేక పూజలు జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త :** తూంకుంట గ్రామ పరిధిలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో కార్తీకమాసంను పురస్కరించుకుని మంగళ వారం ప్రత్యేక పూజలు జరిగాయి. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని శ్రీగా యిత్రీ మహాక్షేత్రంలో కార్తీకమాసం సందర్భంగ భక్తులు విచ్చేసి శ్రీఉమామహేశ్వర స్వామికి అభిషే కాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీగాయిత్రీమాత అమ్మ వారిని కూడ భక్తులు దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎస్ఎల్ఎన్‌మూర్తి ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ఘనంగ పూజలు జరిగాయి. లోకకల్యాణం కోసం ప్రస్తుత పరిస్థితిలో అందరి సంక్షేమంను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక పూజలు జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు మహాన్యాస పూర్వకప ఏకాదశ రుద్రా భిషేకం, మహామృత్యుంజయ, రుద్రహోమం, నక్షత్రహోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాసశివ రాత్రిని పురస్కరించుకుని మహాలింగార్చన, బిల్వార్చన, శివపార్వతుల కల్యాణం, గణపతి రుద్రహో మం, జ్యోతిర్లింగార్చన, ఆకాశదీపం,మంత్రపుష్పం, ఆశీర్వచనం, తీర్థప్రసాద వినియోగం, మంగళహా రతి కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు.

## మున్సిపల్ కార్యాలయం ముందు వ్యక్తి హల్‌చల్

**- మ్యుటేషన్ కాపీ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం**



బాధితుడిని మున్సిపల్ కార్యాలయం నుండి బయటకు తీసుకువెళ్తున్న ఎస్ఐ

**తాండూరు, నవంబరు 22, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ కార్యాలయం ముం దు వ్యక్తి హల్‌చల్ చేశాడు. మ్యుటేషన్ కాపీ ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని ఓ వ్యక్తి మున్సిపల్ కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన తీవ్రకలకలం రేపింది. ఇందకు సంబంధించి బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ధన్‌గర్‌గల్లికి చెందిన విద్యాసాగర్ తల్లి బుచ్చమ్మ పేరు పై ఓ ఇళ్లు ఉంది. లలితమ్మకు 9మంది సంతానం. గత కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో లలితమ్మ మరణించింది. అయితే, లలితమ్మ పేరుమీద ఉన్న ఇళ్లను అమెకూ తురుపై మున్సిపాల్టీలో పేరు మార్పిడి చేసి మ్యుటేషన్ చేశారు. విషయం తెలుసుకున్న విద్యాసాగర్ గత జనవరిలో తన తల్లిపేరుపై ఉన్న ఇంటికి సబంధించి మ్యుటేషన్ కాపిఇవ్వాలని మున్సిపల్ అధి. కారులకు దరఖాస్తు చేసుకున్నాడు. అయితే అప్పటి నుండి ఇప్పటి వరకు మ్యుటేషన్ కాపి కోసం ము న్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా అధికారులు కనికరించకపోవడంతో విసుగెత్తి పోయిన బాధితుడు విద్యాసాగర్ మంగళవారం మున్సిపల్ కార్యాలయంలోనే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయ త్నానికి పాత్పడ్డాడు. వెంటనే అధికారులు అప్రమత్తమై పోలీసులకు సమాచారం అందించడంతో పట్టణ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో మున్సిపల్ కార్యాలయానికి చేరుకొని బాధితుడికి నచ్చచెప్పి అక్కడి నుండి పంపించారు. అయితే బాధితుడు మాట్లాడుతూ.. మ్యుటేషన్ కాపీ కోసం పలుమార్లు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఇంతవరకు రేపు మాపు అంటూ అధికారులు నిర్లక్ష్యంగా సమాదానం ఇస్తూ దాటవేస్తున్నారని. అంతేకాకుండా మ్యుటేషన్ కాపి ఇవ్వాలంటే రూ. లక్ష చెల్లించాలంటూ అధికారులు డిమాండ్ చేస్తున్నారని బాధితుడు విద్యాసాగర్ అరోపించాడు. తనకు డబ్బులు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు పేర్కొన్నారు. పోలీసులు నచ్చచెప్పడంతో బాధితుడు విద్యాసాగర్ అక్కడి నుండి వెళ్లిపోయాడు.

## జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య ఆకస్మిక పర్యటన

**ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
పోచారం మున్సిపల్‌తో పాటు మండలంలోని అవుశాపూర్ గ్రామంలో మంగళ వారం జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య ఆకస్మాత్తు పర్యటించి పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. మొదటగా జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య పోచారం మున్సిపల్ పరిధిలోని అన్నోజిగూడలో పర్యటించి ఇన్ఫోసిస్ కంపెనీ వరకు గల రోడ్డును పరిశీలించి అవసరమున్న చోట మొక్కలను నాటించాలని కమిషనర్‌ను కోరారు. మున్సిపల్‌లో ఉదయాన్నే చేపడుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఎల్ఐజీ కాలనీ వద్ద చేపడుతున్న డీఆర్‌సీసీ సెంటర్‌ను పరిశీలించారు. కాలనీ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన డంపింగ్‌యార్డును అదనపు కలెక్టర్ పరిశీలించారు. వరంగల్ జాతీయ రహదారికి ఇరువైపుల ఉన్న రోడ్లను పరిశీలించారు. పారిశుద్ధ్యంతో పాటు హరితహారం చేపట్టాలని సూచించారు. ఓఆర్ఆర్ నుండి యాంనంపేట్ వరకు గల సర్వీస్ రోడ్డును పరిశీలించి రోడ్డుకు ఇరువైపులా గల ముళ్లపొదలని తొలగించాలని కమిషనర్‌కు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అదనపు కలెక్టర్‌కు పూలకుండీని అందజేసి స్వాగతం పలికారు. మున్సిపల్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, హరితహారం తదితర అంశాలను జిల్లా అదనపు కలెక్టర్‌కు వివరించినట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మండలంలోని అవుశాపూర్ గ్రామంలో ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డితో కలిసి పర్యటించి పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, శ్మశాన వాటిక, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. గ్రామంలోని పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో అదనపు కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో హరితహారం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలను అదనపు కలెక్టర్‌కు ఎంపీపీ వివరించారు. ఈ కార్యక్రమంలో పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి, ఎంపీపీ వై. సుదర్శన్ రెడ్డి, పోచారం మున్సిపల్ కమిషనర్ ఎ. సురేశ్, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, అవుశాపూర్ పంచాయతీ కార్యదర్శి గౌతమి, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, నాయకులు నర్రీ కాశయ్య పాల్గొన్నారు.



పోచారం మున్సిపల్‌లో పర్యటించేందుకు విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యకు పూలకుండీ అందజేసి స్వాగతం పలుకుతున్న చైర్మన్ బి. కొండల్ రెడ్డి.



అవుశాపూర్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్య

## రాష్ట్రంలో తీరుగులేని శక్తిగా టిఆర్ఎస్

**-రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి**

**-త్వరలో జిల్లాలో కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు**



సమావేశంలో మాట్లాడుతున్న టిఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు,ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 22, ప్రభాతవార్త:**
అరవై లక్షల మంది సభ్యులతో తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ ఎస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదిగిందని జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల, మున్సిపాలిటీల అధ్యక్షులతో మంగళవారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిఆర్ఎస్ కార్యకర్తల బలగాన్ని సుశిక్షితులైన సైనికుల్లా తీర్చి దిద్దే పనిని సంస్థాగతంగా పార్టీ ప్రారంభిం చిందన్నారు. తెలంగాణ అభివృద్ధిపట్ల,టిఆర్ఎస్ నిబద్దతకు భంగం కలిగించడానికి తెలంగాణ వ్యతిరేఖ శక్తులు కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నాయన్నారు. కుట్రలకు,కుతంత్రాల కు భయపడేతత్వం తెలంగాణ రాష్ట్ర ప్రజల రక్తంలోనే లేదన్నారు.ఇటివల జరిగిన సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ,ప్రణాళికలు,సవాళ్లపై టిఆర్ఎస్ అధినేత కేసిఆర్ దిశానిర్దేశించారని ఆయన తెలిపారు.ప్రజలకోసం నిజాయితిగా పనిచేయడమే ద్యేయంగా ముందుకు సాగుదామని సూచించారు.ప్రజలు వాస్తవాలను గమనిస్తూనే ఉంటారని అన్నారు.గ్రామాల్లో వెంటనే పార్టీ అభివృద్ధి కోసం పనిచేసే ముఖ్య కార్యకర్తల వివరాలతో జాబితాను తయారు చేసి సిద్దం చేయాలని త్వరలో కార్యకర్తలతో జోన్లవారిగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సమావేశంలో మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు రమేష్ గౌడ్,బుగ్గరాములు, కొత్త కిషన్ గౌడ్,మున్సిపాలిటీ అధ్యక్షులు కొప్పు జంగయ్య, సిద్దంకి కృష్ణా రెడ్డి,అమరేందర్ రెడ్డి,అల్వాల వెంకట్ రెడ్డి, జంబుల కిషన్‌రెడ్డి తదితరులున్నారు.

## హరితహారానికి సరిపడా మొక్కలను నర్సరీలలో పెంచాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ**

**వికారాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
హరితహారంకు సరిపడా మొక్కలను నర్సరీలలో పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికారాబాద్ పురపాలక సంఘం పరిధిలోని కద్చర్ల గుట్టపై, ఫిల్టర్ బెడ్ వద్ద గల నర్సరీల ౨, మహావీర్ ఆసుపత్రి వద్ద గల పట్టణ ప్రకృతి వనాల ౨ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వచ్చే హరితహారంకు అవసరమైన మొక్కలు అందించేందుకు నర్సరీలలో విరివిగా మొక్కలు పెంచాలని మున్సిపల్ అధికారుల ౨ ఆదేశించారు. నర్సరీల నిర్వహణలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, మున్సిపల్ రెవె న్యూ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీలను పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

### ఫలక్‌నుమా సిబిడి పరిధిలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, నవంబరు 22 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 నుంచి 11 గంటలు వరకు పాతబస్తీలోని రషీద్ కాలనీ, సోహెబ్ కాలనీ, మీరాలం చెరువు, శాస్త్రిపురం, హసన్‌నగర్ ప్రాంతాలలో, 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు గౌస్ నగర్, ఎన్‌బికుంట, సాలెహీన్ కాలనీ, సంజయ్ గాంధీ నగర్, రెహ్మత్ నగర్ బస్తీలలో, 2 నుంచి 5 గంటలు వరకు ఖాజానగర్, ఖాజాపహాడి, బిఎన్‌కె కాలనీ, ఈద్గా, తాడ్‌బన్ ప్రధాన రహదారి, నిజాం కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

### సిటీ కళాశాల లియో క్లబ్ నూతన కార్యవర్గం

చార్మినార్, నవంబరు 22 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాల లియో క్లబ్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. సిటీ కళాశాల లియో క్లబ్ కోఆర్డినేటర్‌గా డాక్టర్. ఎల్. తిరుపతి, అధ్యక్షులుగా జి. ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా చంటి, కార్యదర్శిగా ఆదిత్య, కోశాధికారిగా నరేష్‌లు ఎన్నికయ్యారు. లయన్స్ గోవింద రాజ్, అమిత్ శర్మ, హైదర్ అలీ, ఆఫన్ ఖాద్రిలసమక్షంలో చార్మినార్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిటీ కళాశాల లియో క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవటం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. బాల భాస్కర్ తెలిపారు.

### ఈడిజీఈ ఏడవ ఎడిషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నాగారం నవంబర్22, ప్రభాతవార్త : శామ్‌సంగ్ అత్యంత నమ్మకమైన వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ 27 ప్రముఖ సంస్థలు నుండి 9వేల మంది విద్యార్థులు పాల్గొన్న తమ పాన్ ఇండియా క్యాంపస్ ప్రోగ్రాం శామ్‌సంగ్ ఈడిజీఈ ఏడవ ఎడిషన్‌ను ముగించింది. ఐఐఎం బెంగళూరులో టీమ్ ట్రాన్ సెన్ డెన్స్‌కు చెందిన శ్రేయాస్ ఎస్, అమృత సింగి మరియు షిండే చైతన్య శరద్‌లు మొదటి బహుమతి అందుకున్నారు. వినియోగదారులు కోసం లట్ డివైజ్‌లను అనుసరించడంలో మెరుగుదల కోసం తమ కొత్త ఆధునిక పరిష్కారం జ్యూరీని ఎంతగానో ప్రభావితపరిచింది. వారు 4లక్షల 50వేల రూపాయలు నగదు బహుమతిని గెలుపొందేలా చేసింది.

## శ్రీ దుర్గాదేవికి ప్రత్యేక పూజలు

చార్మినార్, నవంబరు 22 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా పాతబస్తీ పూల్‌బాగ్ క్రాంతి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం వన దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రాంతి యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ బిజెపి నాయకులు రమేష్ యాదవ్ మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవికి అభిషేకాలు, పూజలు జరిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేష న్ ప్రతినిధులు రమేష్ యాదవ్, సంతోష్, రాజు, నర్సి ంగ్, మహేష్‌తో పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు

నార్సి ంగి, నవంబర్ 22 ప్రభాతవార్త : మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయిస్తున్నామని నార్సి ంగి మున్సి పల్ వైస్ ఛైర్మన్ గొర్ల వెంకటేష్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం నార్సి ంగిలోని ముస్లీం బస్తీలో రూ. 20. లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ మంచినీరు, వీధి దీపాలు, సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, పార్కులు, ఓపెన్‌జిమ్‌లు, శ్మశాన వాటికల ఏర్పాటుకు భారీ ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామని వివరించారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఎన్నికల సయమంలో ప్రజలకిచ్చిన ప్రతీ హామీని చేతలలో చేసి చూపిస్తున్నామని తెలిపారు. గతంలో జనవరి నుంచే తాగునీటి ఇబ్బందులు వచ్చేవని ఇప్పుడు తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని వివరించారు. ప్రతీ గల్లీలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాలికబద్ధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ వారి ఇబ్బందులను దూరం చేస్తున్నామని తెలిపారు. ఏ చిన్న సమస్య వచ్చినా మా దృష్టికి తీసుకురావాలని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నామని వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు పుర ప్రముఖులు, టీఆర్ఎస్ నాయకులు, పాల్గొన్నారు.

### 2వేల టన్నుల ప్లాస్టిక్‌ను సేకరించడమే లక్ష్యం

శామీర్‌పేట నవంబర్22, ప్రభాతవార్త : గార్నియర్ మాస్ మార్కెట్ బ్యూటీ బ్రాండ్స్‌లో ఒకటి చెన్నై ప్లాస్టిక్ ఫర్ ఛేంజ్ ఒక సామాజిక ఎంటర్‌ప్రైజ్ సామాజిక సమస్యలను తీర్చడానికి ప్లాస్టిక్ వ్యర్థాన్ని వనరుగా వాడడాన్ని మిషన్‌గా ప్రారంభించబడిన దానితో భాగస్వామ్యంలో, అంకితం చేయబడ్డ ప్లాస్టిక్ వ్యర్థ సేకరణ కేంద్రంలో నిధులని సమకూర్చడంతో పర్యావరణాన్ని కాపాడడంలో దాని నిబద్ధతను బలపరుచుకుంది. దాని మొదటి సంవత్స రంలోని, సముద్రం అడుగున పేరుకున్న ప్లాస్టిక్ నుంచి 2వేల టన్నులను సేకరించడాన్ని దాని లక్ష్యంగా చేసుకుని ఈ కేంద్రం ప్రాంతీయ సంఘాల నుండి 200మంది వ్యక్తుల జీవితాలకి సాధికారత ఇస్తుంది. సేకరించబడ్డ ప్లాస్టిక్ గార్నియర్ యొక్క ఐకానిక్ హెయిర్‌కేర్ అల్ట్రాడౌన్స్ పరిధిలో, యురోపియన్ మార్కెట్లలో, ప్యాకేజ్ చే యడంలో ఏకికృతం చేయబడుతుంది. గార్నియర్ ముంబాయ్, చైన్నై, ఢిల్లీలోని ప్రముఖమైన ప్రాంతాలంతటా 20కోట్లను వినియోగదారులను వారి ఓన్‌గ్రీన్‌స్టెప్ తీసుకోవడానికి ప్రోత్సహించేందుకు ప్లాస్టిక్ సేకరణ కొరకు సిద్ధం చేస్తుడ్డి.

### అయ్యప్ప స్వామి మహా పడిపూజ
## ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించిన మంత్రి సబితారెడ్డి

నార్సి ంగి, నవంబర్ 22 ప్రభాతవార్త : గండిపేట్ మండలం మణికొండలో ఈ నెల 26.వ, తేదీన జరుప తలపెట్టిన అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆహ్వాన పత్రాన్ని రాష్ట్ర మంత్రి సబిత ఇంద్రారెడ్డి ఆవిష్కరించారు. మణికొండ మాజీ సర్పంచ్ యాలాల నరేష్ గురుస్వామి ఆధ్వర్యంలో సుందర్ గార్డెన్‌లో పడిపూజ జరుగుతుంది. ఈ పడిపూజ మద్రాస్‌కు చెందిన మున్ను స్వామి నాయుడు చేతులపై శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాజేందర్‌గౌడ్, సాయిరెడ్డి, జయసింహ్మా రెడ్డి గురుస్వాముల పర్యవేక్షణలో పడిపూజ జరుగుతుందని యాలాల నరేష్ తెలిపారు. కలియుగ ప్రత్యక్ష దైవం, హరిర తనయుడు శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజలో పాల్గొని ఆయన కరుణా, కటాక్షాలకు పాత్రులు కావాలని నరేష్ గురుస్వామి పేర్కొన్నారు.

### భీంరావుకు సత్కారం

**మిరుదొడ్డి, నవంబర్ 22, ప్రభాతవార్త :** అంతర్జాతీయ అంబేద్కర్ సేవా సమితి ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జిగా నియమితులైన భూంపల్లి భీంరావును మంగళవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి శాలువ, పూలమాలలో ఘనంగా సత్కరించారు. కార క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో ప్రథమ స్థానం

**సిద్దిపేట రూరల్, నవంబర్ 22, ప్రభాతవార్త :** జన విజ్ఞాన వేదిక ఆధ్వ ర్యంలో నిర్వహించిన చకుముకి సైన్స్ సంబరాల్లో శ్రీవాణి టెక్నో స్కూల్ విద్యార్థులు చక్కటి ప్రతిభకనబరిచారు. మండలస్థాయిలో అర్. శివకుమార్, సిహెచ్. హిమజ, కె. కావ్య ప్రథములుగా నిలిచారు. ఈ సందర్భంగా పాఠ శాల కరస్పాండెంట్ సిహెచ్. సత్యం విద్యార్థులు చూపిన ప్రతిభ పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచే విధంగా విద్యా ర్థులను సిద్ధం చేస్తామన్నారు.

## మనుగడ కోసమే కాంగ్రెస్ పార్టీ నిరసనలు

**బెజ్జ ంకి, నవంబర్ 22, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ మనుగడ కోసమే ఆ పార్టీ నాయకులు నిరసనల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన పేరుతో కాంగ్రెస్ పార్టీ మండల ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని.. బెజ్జ ంకి నుంచి బేగంపేట వరకు నిర్మించే రోడ్డు ఇటీవల టెండర్ ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని పోతారం నుంచి బెజ్జంకి వరకు వేసిన టె ండర్ ప్రక్రియ రద్దు కావడం వల్ల ఆలస్యం జరుగుతుంద్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పూరైన సీసీ రోడ్లు కాంగ్రెస్ నాయకులకు కనిపించడం లేదా అని మహిపాల్‌రెడ్డి ప్రశ్నించారు.

### విశ్వకర్మ సేవా సమితి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక

**సిద్దిపేట రూరల్, నవంబర్ 22, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా కేంద్రంలో విశ్వకర్మ సేవా సమితి కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించి అదివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గుగ్గిల వేణును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశ్వకర్మ సేవా సమితి అధ్యక్షులుగా పెందోట శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శిగా శానంగారి చంద్రశేఖరాచారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసాచారి, చంద్రశేఖరాచారిలు మాట్లాడుతూ సంఘం పటిష్టతతో పాటు జాతీ అభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో కార్యవర్గాన్ని వేసి అభివృద్ధికి పాటుపడుతామని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందులకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుల పక్షాన కాంగ్రెస్ పోరుబాట

### పిసిసి సభ్యులు మామిళ్ల ఆంజనేయులు



మాట్లాడుతున్న మామిళ్ల ఆంజనేయులు

**మెదక్ మున్సి పాలిటీ, నవంబర్ 22 ప్రభాతవార్త:** రైతుల పక్షాన కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టినట్లు పీసీసీ సభ్యులు మామిళ్ల ఆంజనేయులు తెలిపారు. మంగళవారం మెదక్ పట్టణంలోని డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న అన్ని మండల కేంద్రాలలో, 30న నియోజకవర్గ కేంద్రాలలో, 5న జిల్లా కేంద్రాలలో రైతుల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో వెంటనే రుణమాఫీ చేయాలని, ఎనిమిది సంవత్స రాలుగా ప్రకృతి వైపరీత్యాల వలన జరిగిన పంట నష్టాలకు వెంటనే పరిహారం ఇవ్వాలన్నారు. సమగ్ర భూసరేన జరిపి నిజమైన హక్కు దారులకు పట్టా పాసు పుస్తకాలు ఇవ్వాలని, వివాదాస్పద భూములకు గ్రామసభలు నిర్వహించి భూ సమస్యలు పరిష్కారంచేయాలన్నారు. 2006 అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేసి అర్హులైన అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలని, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు ఉన్న ప్రాంతాలలో సాగుచేసుకుంటున్న వారికి ముందుగా అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు అందజేయాలని, ఆతర్వాత అటవీ, రెవెన్యూ శాఖల మధ్య సర్వే చేసి సరిహద్దులను గుర్తించాలని, సాగులో ఉన్న భూమి రెవెన్యూ భూమిగా తెలితే రెవెన్యూ చట్టాల ప్రకారం చట్టాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, మైనారిటీ సెల్ పట్టణ అధ్యక్షులు అహ్మద్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు, మైనారిటీ నాయకులు సూఫీ, భూపతి, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దయాసాగర్, విష్ణు, భారత్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణరెడ్డి

### కరాటే నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలో సివి రామన్ విద్యార్థుల ప్రతిభ

**హుస్నాబాద్, నవంబరు 22, ప్రభాతవార్త :** ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన 36వ షోటో కాన్ నేషనల్ చాంపియన్ కరాటే పోటీల్లో హుస్నాబాద్ పట్టణానికి చెందిన సర్ సివి రామన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎనిమిది మంది ప్రతిభకనబరచగా మంగళవారం విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కాయిన నారాయణరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతో మానసిక ఉల్లాసం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ధర్మపురి శ్రీనాథ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృధం, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

### పెత్తందారి వ్యవస్థకు ఊతమిస్తున్న బీజేపీ



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

**బెజ్జ ంకి, నవంబర్ 22, ప్రభాతవార్త :** దేశంలో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరంచేస్తూ పెత్తందారి వ్యవస్థకు బీజేపీ ఊతం పోస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఐ నాయకుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. దేశంలో అర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవడానికి కారణం కేంద్రంలోని బీజేపీ పార్టీ అధికారంలో ఉండడమేనని తెలిపారు. దేశంలో నిత్యావసర ధరలు పెరిగి సామాన్యులు జీవించలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలోని టిఆర్ఎస్ సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. విచ్చలవిడిగా సాగు చేయని భూములకు పట్టా పుస్తకాలతో రైతు బంధు అమలు చేయడం సరికాదన్నారు. వచ్చే నెల 2న సీపీఐ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బోనగిరి రూపేష్, పోతిరెడ్డి వెంకటరెడ్డి, నిమ్మ ధర్మారెడ్డి, దొంతరవేణి మహేష్, పందుగ పర్శరాములు, కుంభం రాములు, రొడ్డ చరణ్, రావుల కనకయ్య ఏఐఎస్ఎఫ్ నాయకులు బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

### నిజమైన లబ్ధిదారులకే డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలి

**రాయపోల్, నవంబరు 22, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం డబుల్ బెడ్‌రూం ఇండ్ల పథకాన్ని చేపట్టి ఇండ్లు నిర్మిస్తే అట్టి ఇండ్లల్లో అనర్హులు నివాసం ఉంటున్నారని, రెవెన్యూ అధికారులు వెంటనే మళ్లీ రిసర్వేచేసి నిజమైన అర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామస్తులు నగేష్, రాజయ్యలు అన్నారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సహదేవ్‌కు వనతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కనీసం ఉండడానికి గూడు లేని నిరుపేద కుటుంబాలు లింగారెడ్డిపల్లి గ్రామంలో ఉన్నాయన్నారు. అలాంటి వారికి కాకుండా అనర్హులకు అధికారులు ఇండ్లు కేటాయించకున్న ఇటీవల కురుసిన వర్షాలకు ఎవరికి వారే వెళ్లి నిర్మించిన 25 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లల్లో అనర్హులు ఉంటు న్నారని అన్నారు. దీనివల్ల వల్ల నిజమైన లబ్దిదారులకు అన్యాయం జరుగు తుందన్నారు. మళ్లీ ప్రభుత్వం సర్వే నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు డబు ల్‌బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరారు



తహసీల్దార్ సహదేవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

### విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి : ఎంఈఓ

**కొండపాక, నవంబర్ 22, ప్రభాతవార్త :** విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల ఎంఆర్‌సీ జన విజ్ఞాన వేదిక అధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు మంగళ వారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందిచాలని.. సైన్స్ అంటేనే శాస్త్రీయ వైఖరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, రాజశ్రీ, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బాలరాజు, ఉపాధ్యాయులు రామస్వామి, చంద్రభాను పాల్గొన్నారు. మొదటి బహుమతి కొండపాక బాలుర హైస్కూల్, రెండో బహుమతి కేజీబీవీ కొండపాక, తెలుగు మీడియం కేటగిరిలో మొదటి బహుమతి హైస్కూల్ దుద్దెడ, కుకునూర్‌పల్లి హై స్కూల్ గెలుపొందాయి.

### రైతులకు భరోసా రైతు బీమా : నర్సింహారెడ్డి

**ములుగు, నవంబరు 22 (ప్రభాతవార్త):** రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతులను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం తెరాస ప్రభుత్వమని మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సందుగారి నర్సి ంహ్మారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ములుగు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో బొమ్మ లక్ష్మి ఇటీవల మృతిచెందగా ఆమె పేరుమీద భూమి ఉండడంతో ఆమెకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రైతు బీమా రూ. 5 లక్షల ఎన్ఓసి అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంట్ల వెంకట్‌రెడ్డి, ఏఈఓ పృథ్వితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

### బీమా చేయండి ధీమాగా ఉండండి

**జగదేవ్‌పూర్, నవంబరు 22 (ప్రభాతవార్త):** వ్యక్తిగత ప్రమాదబీమా పాలసీ చేసుకొని కుటుంబానికి ధీమా అందించాలని ఎస్‌బిఐ మేనేజర్ మనోహర్ అన్నారు. జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన కొట్టాల లలిత కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా మృతురాలికి ఎస్‌బిఐలో రూ. 200 ప్రమాద బీమా ఉండడంతో వారి కుటుంబానికి రూ. 4 లక్షల బీమా సొమ్ము మంజూరు కావడంతో మంగళవారం మేనేజర్ మనోహర్ సిబ్బందితో కలిసి మృతురాలి భర్త కొట్టాల యాదగిరి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌బిఐ వ్యక్తిగత ప్రమాదబీమా పాలసీలో కేవలం సంవత్సరానికి ఒక్కసారి రూ. 100 చెల్లిస్తే రూ. 2 లక్షలు, రూ. 200 చెల్లిస్తే రూ. 4 లక్షలు, రూ. 500 చెల్లిస్తే రూ. 10 లక్షలు, వెయ్యి చెల్లిస్తే రూ. 20 లక్షలు వ్యక్తిగత ప్రమాద బీమా కింద కుటుంబానికి అందుతాయని అన్నారు. ఈ అవకాశాన్ని ఎస్‌బిఐ ఖాతాదారులు అందరూ సద్వినియోగం చేసుకొని కుటుంబానికి భరోసా ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్, బ్యాంకు సిబ్బంది పవన్, శ్రీధర్, కిరణ్, చంద్రశేఖర్, అప్పారావు, రాజు, బ్యాంకు మిత్ర మురళి తదితరులు పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, నవంబరు 22 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట గ్రామానికి చెందిన గడ్డం వెంకటేష్ అనారోగ్యం కారణంగా మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న జెడ్‌పిటిసి మంగమ్మరాంచంద్రం, మండల పార్టీ అధ్యక్షుడు కర్ణాకర్‌రెడ్డిలు ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, స్థానిక సర్పంచ్ గాయత్రిబాల్‌నర్స య్యతో కలిసి మంగళవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు టిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రిబాల్‌నర్స య్య, ఏఎంసి డైరెక్టర్ బాబుయాదవ్‌లు రూ. 7వేల ఆర్థిక సహాయం అందజేశారు. వీరితో పాటు గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, నాయకులు గడ్డం రామచంద్రం, ఎండి. లతీఫ్ ఉన్నారు.

### బాధిత కుటుంబాలకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శ

దుబ్బాక, నవంబర్ 22, ప్రభాతవార్త: దుబ్బాక మండలంలోని నగరం గ్రామంలో సందా రాజయ్య, ఆకారం గ్రామంలోని కౌలిపాక బాబు, వడ్ల బాలరాజం, కమ్మరి సక్కుబాయి, అనుప నర్సి ంలు ఇటీవలే వివిధ కారణలతో మృతి చెందిన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వీరి వెంట నాయకులు పాతురి వెంకటస్వామి గౌడ్, కోరడ్ల రవింధరరెడ్డి, కోనపురం బాలు యాదవ్, నరేందర్ రెడ్డి, గోపాల్, అనిల్, సంజీవ్, వెల్పుల యాదగిరి, గాజుల రమేష్, యాదవ రెడ్డి, ఎల్లం యాదవ్, వినయ్, రాజిరెడ్డి, రజేందర్ తదితరులు ఉన్నారు.

## ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : న్యాయమూర్తి

**బెజ్జ ంకి, నవంబర్ 22, ప్రభాతవార్త :** చిన్న చిన్న గొడవలకు కోర్టు వరకు వెళ్లకుండా గ్రామ పెద్దలు, పంచాయతీల సమక్షంలోనే సమస్యలను పరిష్కరించుకోవాలని న్యాయమూర్తి ఎ. కృష్ణ తేజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేగులపల్లి గ్రామంలో హుస్నాబాద్ కోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, చిన్న తగవులతో స్టేషన్‌వరకు వెళ్లి అపై కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయంతో పాటు ఆర్థికంగా నష్టపోతారన్నారు. చిన్న గొడవలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలన్నారు.



చట్టాలపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి కృష్ణ తేజ

**పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలి**

పిల్లల తీరుపై ప్రత్యేక దృష్టిసారించాలని న్యాయమూర్తి ఎ. కృష్ణతేజ తల్లిదండ్రులకు సూచించారు. పిల్లలు మొబైల్ వాడకం ద్వారా చెడువైపు అకర్షితులవకుండా పర్యవేక్షించాలన్నారు. యువత గంజాయి వంటి మాదకద్రవ్యాల వాడకంలో రెండోసారి పట్టుబడితే 96 రోజుల జైలు శిక్ష విధించడం జరుగుతుందన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాలపై పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు.

**మహిళల కోసం ప్రత్యేక చట్టాలు**

మహిళల కోసం ప్రత్యేక చట్టాలున్నాయని వాటిపై ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి ఎ. కృష్ణతేజ చెప్పారు. ఎదైనా కేసు విషయంలో సూర్యాస్తమయం దాటితే మహిళలను కస్టడీలోకి తీసుకునే అవకాశం లేదన్నారు. తప్పని పరిస్థితిలో కస్టడిలోకి తీసుకోవాలంటే న్యాయమూర్తి ద్వారా లిఖిత పూర్వకంగా అనుమతి తీసుకున్నాకే మహిళ ఎస్ఐ లేదా కానిస్టేబుల్ ద్వారా కస్టడీలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు.

బాల్య వివాహాలు చేస్తే రెండేళ్ల జైలు, రూ. లక్ష జరిమాన విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెల్ల ఐలయ్య, ఎస్ఐ నరేష్‌రెడ్డి, ఎంపిటిసి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప అందరిని చల్లంగా చూడాలి



అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహిస్తున్న స్వాములు

**నందిగామ నవంబర్22, ప్రభాతవార్త :** నందిగామ మండలంలోని ఆయా గ్రామాలలో భక్తులు అత్యంత్యంత భక్తిశ్రద్ధలతో అయ్యప్పకు పూజలు చేస్తున్నారు. మంగళవారం నందిగామ మండలం తాటిగడ్డ తండాలో గురుస్వామి జెట్టావత్ లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో వార్డు సభ్యులు శ్రీను నాయక్, సురేందర్ నాయక్, గోపాల్ నాయక్, వినోద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. అందరికి మంచి జరగాలని వారు వేడుకున్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూడూరు మండలం మన్నెగూడ జేకే ఫంక్షన్‌హాలులో జరిగిన పడిపూజలో పాల్గొన్న డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి, భక్తులు, తదితరులు

**పూడూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని మన్నెగూడ జేకే ఫంక్షన్‌హాలులో మంగళ వారం అయ్యప్ప మహా పడిపూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. గ్రామానికి చెందిన పలువురు భక్తులు అయ్యప్ప మాలాధారణ చేసి 41రోజులుగా నియమ నిష్ఠలతో ధీక్షలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా మంగళ వారం గ్రామంలో గురుస్వాముల అధ్వర్యంలో భారీఎత్తున పడిపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి, డిసిసిబి ఉమ్మడి రంగారెడ్డిజిల్లా చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి, పలువురు టిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్పస్వామి ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరు చల్లంగ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పడిపూజలో పాల్గొన్న భక్తులకు గురు స్వాములు తీర్థప్రసాదాలు అందజేయగా, శ్రీనివాసా హోటల్ యజమాని రామన్న కుటుంబీకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, పలు గ్రామాలకు చెందిన అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

### పోడు భూమి రైతులకు
### హక్కు పత్రాలు మంజూరయ్యేలా కృషి : సర్పంచ్

**కొల్చారం, నవంబర్ 22 ప్రభాతవార్త:** పోడుభూమిని సాగు చేసుకుంటున్న ప్రతి రైతుకు హక్కు పత్రాలు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని కొల్చారం మండలం కొంగోడ్ గ్రామ సర్పంచి కుకునూరి మంజుల సత్య నారాయణగౌడ్ అన్నారు. మంగళవారం కొంగోడ్ గ్రామంలో సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన పోడు భూముల గ్రామసభ నిర్వహించారు. గ్రామసభకు ఎంపీడీవో ప్రవీణ్‌తో పాటు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో 143 మంది పోడు భూములను సాగు చేస్తున్నారని, అందులో 58 మందికి హక్కు పత్రాలకు అర్హులని అధికారులు ప్రకటించారు. అర్హులజాబితాలో పేర్లు లేని రైతులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ పోడుభూములను సాగు చేసుకుంటున్న ప్రతి రైతుకు హక్కు పత్రాలు మంజూరు అయ్యేలా కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీ ఉదయ వేమారెడ్డి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీహరి, ఎఫ్ఆర్‌సీ కమిటీ అధ్యక్షులు తుపాకుల మల్లేశం, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, పోతంశెట్టిపల్లి పంచాయితీ కార్యదర్శి అరుంధతి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, రేషన్ డీలర్ స్వామి, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తాం

**కొల్చారం, నవంబర్ 22 ప్రభాతవార్త:** మండల పరిధిలోని చిన్న ఘనపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం బాలల వద్దకు పాలన అన్న భావంతో స్థానిక సర్పంచి ఇందిరా ప్రియదర్శిని సందీప్, కార్యదర్శి, వార్డు సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకొని పరిష్కారానికి సూచనలు ఇస్తూ, ప్రభుత్వానికి తెలియజేసి అనుమతులు కోరుతూ సమస్యలుతీరుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతారాం, ఎస్ఎంసీ చైర్మన్ శంకర్, సిద్ధలక్ష్మీ, ఉపాధ్యాయులు సిద్ధిరాములు, మహేష్, సంగయ్య, వార్డు సభ్యులు మల్లేష్, ఇమ్రాన్ బాబా, పుట్టి లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్లు పద్మ, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

### అపోలో మైక్రో సిస్టమ్స్ మెరుగైన పనితీరు

నాగారం నవంబర్22, ప్రభాతవార్త : అపోలో మైక్రో సిస్టమ్స్ కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్థానికి రూ. 108.80 కోట్ల ఆదాయాన్ని రూ. 4.92కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ. 73.42 కోట్లు, నికరలాభం రూ. 3.33 కోట్ల ఉన్నాయి. దీంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరునెలల్లో ఆదాయం 48శాతం నికరలాభం 47 శాతంపెరిగినట్లు అవుతోంది. ఈ ఏడాది జూన్ 30 నాటికి అపోలో మైక్రో సిస్టమ్స్ చేతిలో రూ. 280 కోట్ల విలువైన అర్డర్లు ఉన్నాయి.

### ఎల్‌వోసీని అందజేసిన ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, నవంబర్ 22 ప్రభాతవార్త:** పలు వ్యాధుల బారిన పడి దవాఖానల్లో చికిత్స పొందుతున్న పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఆర్థిక సహాయం అందజేస్తున్నామని ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి అన్నారు. నిజాంపేట మండలం చేల్మడ గ్రామానికి చెందిన బి. దుర్గయ్య తండ్రి నారాయణ అనారోగ్యం బారినపడిన విషయం మండల నాయకుల ద్వారా మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తెలిపారు. దీంతో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ నుండి రూ. 1,00,000 ఎల్‌వోసీని మంజూరు చేయించారు. ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం క్యాంపు కార్యాలయంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి, మెదక్ మున్సి పల్ చైర్మన్ చంద్రపాల్, నిజాంపేట మండల పార్టీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, చల్మేడ ఎంపీటీసీ నంద్యాల బాల్‌రెడ్డి, తిరుమల స్వామి, ఆలయ చైర్మన్ ఆకుల మహేష్, మాజీ ఉప సర్పంచి బాజ దుర్గయ్య, నగరం సర్పంచి గేమ్‌సింగ్, మెదక్ పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడినడ, నాయకులు రాగి అశోక్, లింగారెడ్డి, చింతల నర్సి ంలు తదితరులు పాల్గొన్నారు.

### రైతులకు అందుబాటులో విత్తనాలు : ఎవో శ్వేత

**కొల్చారం, నవంబర్ 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో వరి, పొద్దు తిరుగుడు, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి శ్వేత మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పూర్తి వివరాలకు ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

### సేవలను మరింత సులభంగా అందిస్తుంది

శామీర్‌పేట నవంబర్22, ప్రభాతవార్త : డిజిటల్ సమ్మిళిత దిశగా ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ మరో అడుగు ముందుకు వేయడంతో పాటుగా ఫేస్ అథెంటికేషన్ ఆధారిత సేవింగ్ బ్యాంక్ ఖాతా తెరిచే అవకాశాలను వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించింది. ఈ సదుపాయంతో ఖాతా తెరిచే ప్రక్రియ మరింత సౌలభ్యంగా మారడంతో పాటుగా వినియోగదారుల కోసం ఈ సేవలను మరింత సులభంగా మారుస్తోంది. ఈ నూతన సదుపాయం బ్యాంక్ యొక్క బిజినెస్ కరస్పాండెంట్స్ (బీసీలు)కు కేవలం ఫేస్ అథెంటికేషన్ ఈ కెవైసీ చేపట్టడంతో ద్వారా ఖాతా తెరించేందుకు వీలు కల్పిస్తుంది.

## ఏపీఎంను బదలీ చేయాలని వినతి



మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సీసీలు

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 22,(ప్రభాతవార్త):** జిల్లెడు చౌదరిగూడ మండలంలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్న రామస్వామి తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆతనిని ఇక్కడి నుంచి బదిలి చేయాలని కోరుతూ మంత్రి సబితాఇంద్రారెడ్డి, కలెక్టర్, డీఆర్‌డిఎ పీడిలకు సీసీలు స్వర్ణలత, స్వరూప, దేవయ్యలు వినతి పత్రాలు అందజేశారు. సీసీలుగా తమ విధులు సరిగ్గా నిర్వహిస్తున్న ప్పటికి కావాలని దురుసు మాటలతో ఇబ్బందులు పెడుతున్నట్లు వారు వివరించారు. సంబదిత అధికారులు స్పందించి ఏపీఎంను బదిలి చేయాలని వారు కోరారు.

## ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న టెక్నికల్ అసిస్టేంట్ లక్ష్మారెడ్డి

**జిల్లెడు చౌదరిగూడ, నవంబర్ 22,(ప్రభాతవార్త):** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని గ్రామాల్లోని రైతులు, ప్రజలు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ అసిస్టేంట్ లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని గుంజల్ పహాడ్‌లో ఉపాధి హామీ ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాబోవు ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే పనులు ఎంపిక కోసం గ్రామసభ నిర్వహించినట్లు తెలిపారు. గ్రామంలో చేపట్టే ప్రతి పనికి గ్రామసభ తీర్మాణం తప్పని సరిగా ఉండాలని ఆయన తెలిపారు. రైతులు తమకు కవాల్సిన పనుల కోసం గ్రామ పంచాయితీలో ధరకాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తరువాత పనులు చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ఫీల్డ్ అసిస్టేంట్ రవి, వజ్రం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలి

### -సిపిఎం మున్సిపాలిటీ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష



ఇబ్రహీంపట్నం డిప్యూటి తహసీల్దార్‌కు వినతీ పత్రాన్ని అందజేస్తున్న సిపిఎం మున్సి పాలిటీ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష, తదితరులు.

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 22, ప్రభాతవార్త:** అర్హులైన నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇవ్వాలని సిపిఎం మున్సిపాలిటీ కార్యదర్శి చింతపట్ల ఎల్లేష డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం డిప్యూటి తహసీల్ధార్‌కు వినతీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనేకమంది నిరుపేదలు ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇండ్లను ఇచ్చి వారికి అదుకోవాలని సిపిఎం పార్టీ తరుపున ఆయన డియాండ్ చేశారు. కార్యక్రమంలో ము న్సిపాల్ కమిటీ నాయకురాలు యోలమోని స్వప్న, ఎండి. షకూర్, ప్రజలు దొంకని నర్సింహ్మా, సునీత, ఆసియా, రమాదేవి, ఖాసీం, తదితరున్నారు.

### దశరథ్ కుటుంబాన్ని పరామర్శించిన సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి

**తలకొండపల్లి నవంబర్22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామపంచాయతీలో ఇటీవల మరణించిన మాజీ ఎంపిటిసి నరసమ్మ మరణించడంతో భర్త దశరథ్ ను కుటుంబ సభ్యులను ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ మనోధైర్య చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు రమేష్, శ్రీశైలం, నాగమణి లింగం గౌడ్, అనురాధ నరేందర్ గౌడ్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తుల్లా తిరుపతయ్య గౌస్, భరత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిరెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం

**తలకొండపల్లి నవంబర్22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండల కేంద్రానికి చెందిన పుట్ట జంగమ్మ, పోలే శివలీల అనారోగ్యంతో బాధపడుతూ మరణించడంతో సర్పంచ్ లలిత జ్యోతయ్య ద్వారా విషయం తెలుసుకున్న జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ మృతిరాల కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ తన ఉప్పల చారిటుబల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి 3వేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లలిత జ్యోతయ్య, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్, వార్డు మెంబర్స్ నూకం కోటేశ్వర్ ముదిరాజ్, విటల్, వెంకటయ్య, రమేష్, రవి కుమార్, పెద్దశేఖర్, వెంకటేష్ యాదవ్, రాంమోహన్ రెడ్డి, కృష్ణ, పాషా, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

**తలకొండపల్లి నవంబర్22,ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలం తుమ్మలకుంట తండా గ్రామ పంచాయతీకి మరియు సడక్ తండా గ్రామాలలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అంగన్‌వాడీ విద్యార్థులకు జడ్పిటిసి ఉప్పల వెంకటేష్ తన ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ...జడ్పిటిసి వెంకటేష్ కల్వకుర్తి నియోజకవర్గ స్థాయిలోని ప్రభుత్వ పాఠశాలలోని దాదాపు 20వేల మంది విద్యార్థులకు సుమారు 80లక్షల రూపాయలతో సొంత ఖర్చుతో క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని పిల్లలలో ఉత్సాహాన్ని పెంపొందించే విధంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుపేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, ఎంపిటిసి సోని లక్ష్య, సింగిల్ విండో డైరెక్టర్ దేవ్లా నాయక్, హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, సడక్ తండా హెచ్‌ఎం మోహన్ కుమార్, ఉపాధ్యాయురాలు జ్యోతి, నాయకులు వెంకట్ రాజిరెడ్డి, పాండు నాయక్, దేస్య నాయక్, మన్య నాయక్, కృష్ణ నాయక్, పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న ఎంపిపి, తదితరులు

# చేపల పెంపకంతో మత్స్యకారులను ఆదుకుంటున్న ప్రభుత్వం

### -కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్



చెరువులో చేపలు వదులుతున్న ఎమ్మెల్యే

**తలకొండపల్లి నవంబర్22,ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని ఆయా గ్రామాల్లో గల మత్స్యకారుల అభివృద్ధి కోసం చెరువులు కుంటల్లో చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ ,చంద్రధన గ్రామాల్లో చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల బాగోగుల కోసం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు జరుపుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కెసిఆర్ నాయకత్వంలో సంక్షేమ అభివృద్ధి పథకాలు అమలు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. లక్షల రూపాయలతో చేప పిల్లలను ఉచితంగా అందజేయనున్నట్లు వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్, మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్, సర్పంచ్‌లు రమేష్, కుమార్ శ్యామ్ సుందర్ రెడ్డి, వరలక్ష్మి రాజేందర్ రెడ్డి, ధరణి శివ శంకర్ రెడ్డి, హేమవతి రమేష్, రైతు కమిటీ నాయకులు నరసింహ, ఎంపిటిసి సుధాకర్‌రెడ్డి, రాంపూర్ రైతు కమిటీ అధ్యక్షుడు కటికల యాదయ్య, దేవాలయ కమిటీ చైర్మన్ శ్రీశైలం యాదవ్, చిన్న హరి మోహన్ రెడ్డి, సజ్జు భాష, నూకం శేఖర్, ఉన్నారు.



సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

### సిసి రోడ్డుకు శంకుస్థాపన

తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలో బిసి కాలనీలో 5లక్షల రూపాయలతో నిర్మించే సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...కల్వకుర్తి నియోజకవర్గంలోని ఆయా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. గ్రామాల్లోని మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రెసిడెంట్ కుమ్మరి శంకర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, మాజీ ఎంపిపి సిఎల్ శ్రీనివాస్ యాదవ్, ఉప సర్పంచ్ మోహన్ రెడ్డి, రైతు కమిటీ అధ్యక్షుడు కటికల యాదయ్య, దేవాలయ కమిటీ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, చిన్న హరి మోహన్ రెడ్డి, నరసింహ రెడ్డి, ఆంజనేయులు ఒరుగంటి వెంకటొరెడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రహదారులతోనే అభివృద్ధి వేగం

### -జడ్పిటిసి అనురాధపత్యనాయక్

**ఆమనగల్లు, నవంబర్22, ప్రభాతవార్త:** మారుమూల గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించాలంటే అనువైన రహదారుల ఆవశ్యకత అవసరమని ఆమనగల్లు జడ్పిటిసి, జిల్లా సాంఘీక సంక్షేమ స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనురాధపత్యనాయక్ అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నిరాధరణకు గురైన గ్రామాలు, పల్లెలకు టిఆర్ఎస్ ప్రభుత్వం రోడ్ల సౌకర్యం కల్పించి అభివృద్ధి పట్టాలను ఎక్కించిందని ఆమె కొనియాడారు. ఆమనగల్లు మండలం మంగళపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెన్నకేశవకాలనీలో జిల్లా పరిషత్ నిధులు రూ. 2.40లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మంగళవారం జడ్పిటిసి అనురాధపత్యనాయక్ స్థానిక సర్పంచ్ నరసింహ్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీలో పర్యటించిన ఆమె ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నామని, జిల్లా పరిషత్ సమావేశాలలో మండల సమస్యలను ఎప్పటికప్పుడు లేవనెత్తితూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు జడ్పిటిసి అనురాధపత్యనాయక్ అన్నారు. సిసి రోడ్ల నిర్మాణం కోసం నిధులు రాబట్టి అనేక గ్రామాలలో రోడ్లను అభివృద్ధి పరిచినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సాయి. రూపం వెంకటొరెడ్డి, మురళి, వెంకటేశ్, రాములు, దండుగుల బాలు, సంపంగి వెంకటేష్, గండికోట శంకర్, జంగయ్య, విజయ్, బాలరాజ్, కుమార్, నరేందర్, అశోక్, తల్లోజు రామకృష్ణ, ఉప్పల రాములుయాదవ్, గుత్తి బాలస్వామి, వడ్డె వెంకటేష్, పూసలి భాస్కర్, లందం యాదయ్య, విఠాయిపల్లి రమేష్, ఎన్. రమేశ్‌నాయక్, మద్దూరి ఆనంద్, గణేశ్‌నాయక్, దేవేందర్ తదితరులు ఉన్నారు.



చెన్నకేశవ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న జడ్పిటిసి అనురాధపత్యనాయక్

# షాబాద్ మండలంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్



జన విజ్ఞాన వేధికలో పాల్గొన్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ

**షాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త :** చెకుముకి సైన్స్ సంబరాలు జన విజ్ఞాన వేధిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ షాబాద్ మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ హాజరయ్యారు. ఈపోటీల్లో మండలంలోని 10 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. షాబాద్ మండల జనవిజ్ఞాన వేదిక కన్వీనర్ జగదీష్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్, తెలుగు, ఇంగ్లీష్ విభాగాల్లో విడివిడిగా విజేతలుగా నిలిచిన పాఠశాలలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాల నుండి ఇంగ్లీష్ మీడియం విజేతలుగా జడ్పీహెచ్ఎస్(బాలికలు) షాబాద్ విద్యార్థులు ఎం.పల్లవి, ఆర్.భార్గవి, శ్రావణి, ప్రభుత్వ తెలుగు మీడియం పాఠశాల విభాగం నుండి జడ్పీహెచ్ఎస్(బాలుర) విద్యార్థులు ఎం.రవి, పి.శృతి, టి.నందిని జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ఇంగ్లీష్ మీడియం విభాగానికి శ్రీచైతన్య హై స్కూల్, నాగర్‌గూడ విద్యార్థులు విజేతలుగా జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈసందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ మాట్లాడుతూ.... శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, పాఠశాలలో చదివిన సైన్స్‌ను నిత్య జీవితానికి అనువదించుకోవాలన్నారు. ఎన్నో శాస్త్ర ఆవిష్కరణలు జరిగి సమాజం శాస్త్రీయ సమాజంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మూఢ నమ్మకాలను వదలాలని, ప్రభుత్వాలు మూఢనమ్మకాల నిరోధక చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ఇంచార్జ్ రాజేశ్వరి, డేవిడ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు యూన్సీ, రమాదేవి, అనిల, చంద్రశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

## రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి



ఆమనగల్లులో ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**ఆమనగల్లు, నవంబర్22, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. డా. బిఆర్. అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్26న ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో రాజ్యాంగం అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహణ ప్రచార రథాన్ని రాజీవ్ చౌరస్తాలో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ... భారత రాజ్యాంగం పట్ల గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించేందుకే నవంబర్ 26న కల్వకుర్తి పట్టణంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. భారత రాజ్యాంగం– రాజ్యాంగ పరిషత్ ఆమోదం పేరిట ఉదయం కల్వకుర్తిలోని టిఎస్‌యుటిఎఫ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ప్రముఖ ప్రజా కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్, ఆమనగల్లు సిఐ జాల ఉపేందర్‌లు తదితరులు పాల్గొంటారని వివరించారు. కాగా ప్రచార రథం ప్రారంభించిన వారిలో పాపిశెట్టి రాము, జి.సు ధాకర్, కొమ్ము తిరుపతి, గొరిగె వెంకటయ్య, రఘురాములు, డేవిడ్, మహేశ్, శ్రీనివాస్‌యాదవ్, పులికంటి మైసయ్య, వంకేశ్వరం భీమయ్య, జంగయ్య, డిలార్, శంకర్, కుద్దూస్, రాములు, కొప్పు యాదయ్య, నాగిళ్ళ జంగయ్య, చాకలి రాములు, నర్సింహ్మా, కృష్ణయ్య, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

### దేవరయాంజాల్ హైస్కూల్‌ను సందర్శించిన పిఆర్‌టియుటిఎస్ నాయకులు

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త:** దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, అధికారిక అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిలు సందర్శించారు. మంగళవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను వారు సందర్శించి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉపాధ్యాయులను కలిసి చర్చించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగ పిఆర్‌టియుటిఎస్ నాయకులు సందర్శించి ఉపాధ్యాయులు అందరు కూడ తమ ఓటు హక్కును తప్పకుండ వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పిఆర్‌టియుటిఎస్ కృషి చేస్తుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ జిల్లా పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్, శామీర్‌పేట మండల పిఆర్‌టియుటిఎస్ అధ్యక్షులు ఆర్. వెంకట్రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీగౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



.దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి మాట్లాడుతున్న రాష్ట్ర పిఆర్‌టియుటిఎస్ నాయకులు, పాల్గొన్న తదితరులు



చనిపోయిన నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేస్తున్న సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్

# పేదలకు అండగా ఉంటా

**కీసర, నవంబరు22, ప్రభాతవార్తః** నిరుపేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు. కీసర గ్రామానికి చెందిన చినింగణి బాలమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో విషయం తెలుపుకున్న సర్పంచ్ మాధురి తన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు 10 వేల రూపాయల అర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ కీసరలో ఉన్న నిరుపేదలకు ఎలాంటి అవసరం వచ్చినా ముందుకు వచ్చి తనవంతు సహాయం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు చినింగణి బాలరాజు, కో ఆప్షన్ సభ్యులు చిత్తార్ల రమేష్, మాజీ ఎంపిపి రామారం సుజాత, నాయకులు గుర్రం లక్ష్మారెడ్డి, మొరుగు దశరథ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**తలకొండపల్లి నవంబర్22,ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి పథకం పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన వడ్ల నరసింహ అనారోగ్యంతో నిమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలిసిన వెంబడే రూ. 2లక్షల 50వేల చెక్కును ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సర్పంచ్ చంద్రయ్య సహకారంతో ఆచారికి అందజేశారు. ఈ కార్యయక్రమంలో సిఎల్ శ్రీనివాస్ యాదవ్, మాజీ జడ్పిటిసి నరసింహ, శివశంకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.

## నష్టపరిహారం ఇప్పించండి

### - ఎమ్మెల్సీ కసిరెడ్డికి రైతుల వినతి



రైతుల నుండి వినతిపత్రం స్వీకరిస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, నవంబర్22, ప్రభాతవార్త:** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా భూములు కోల్పోయిన మాకు వెంటనే తగిన నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ పలువురు రైతులు అధికార పార్టీ ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. మంగళవారం హైదరాబాద్ నగరంలోని కసిరెడ్డి నివాసంలో కలుసుకున్న రైతులు నష్టపరిహారం కోరుతూ వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గంలోని ఆమనగల్లు మండలం పోలెపల్లి, వెల్దండ మండలం చెర్కూరు గ్రామ రైతులు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని ప్రత్యేకంగా కలుసుకున్నారు. రైతులను సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ వారి సమస్యలను విని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి న్యాయం చేస్తానని హామి ఇచ్చినట్లు రైతులు తెలిపారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి స్పందించిన తీరుపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## పేద కుటుంబానికి గుత్తి సహాయం

**ఆమనగల్లు, నవంబర్22, ప్రభాతవార్త:** కూడు, గూడుకు ఇబ్బంది పడుతున్న ఓనిరుపేద కుటుంబానికి ప్రముఖ టిఆర్ఎస్ నాయకులు గుత్తి బాలస్వామి తమవంతు సహాయం అందించి ఆదుకున్నారు. నిత్యావసర వస్తువులు సమకూర్చి ఆ నిరుపేద కుటుంబసభ్యులకు అందజేశారు. పట్టణంలోని 7వవార్డుకు చెందిన గుండమల్ల సాయిలు వృధ్యాప్యంలో పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈమధ్య కురిసిన వర్షాల ధాటికి ఉన్న గూడు సైతం కోల్పోయి ధీనస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు గుత్తి బాలస్వామిని పరిస్థితిని తెలుసుకుని చలించిపోయారు. వెంటనే బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చి 50కేజిల బియ్యం, కూరగాయలు, నిత్యవసర సరుకులు అందజేసి ఆదుకున్నారు. దీంతో ఆ నిరుపేద కుటుంబం ఆనందం వ్యక్తం చేశారు. కాగా గతంలో కూడా గుత్తి పలు నిరుపేద కుటుంబాలకు తమవంతు సహాయం అందించి ఆకలి తీర్చారు. కార్యక్రమంలో పూసలి భాస్కర్, వడ్డె వెంకటేష్, విఠాయిపల్లి రమేష్, జంతుక కిరణ్ తదితరులు ఉన్నారు.

### టీఎస్‌బిబిసిఐపిఎస్ కార్యక్రమంలో పాల్గొన్న బీఎం మెంబర్



టీఎస్‌బిబిసిఐ పిఎస్ కార్యక్రమంలో పాల్గొన్న బీఎం మెంబర్

**కొత్తూర్, నవంబర్ 22, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర జీవ వైవిద్య మండలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు, సెంట్రల్ ఫర్ ఇన్నివేషన్ ఇన్ పబ్లిక్ సిస్టం కార్యక్రమంలో కేశంపేట్ జడ్పీటీసీ, రంగారెడ్డి జిల్లా జీవ వైవిద్య బీఎంసీ మెంబర్ తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి హాజరయ్యారు. ఈకార్యక్రమంలో తెలంగాణ పర్యావరణ, సైన్స్ టెక్నాలజీ శాఖ, తెలంగాణ జీవ వైవిద్య బోర్డు అధికారులు, సభ్యులు తదితరులు ఉన్నారు.




## PUBLIC NOTICE

The General public is hereby informed that our client Shriram City Union Finance Limited Ibrahimpatnam Branch, Hyderabad Dist is dealing with financing business in the course of business Smt. Kambalapally Aruna, W/o. K.Yadagiri Reddy, approached our client for finance and accepted to deposit her title deeds in respect of her property i.e. All that the House bearing No.7-385/4, on Plot No.5 South Part, admeasuring 100 Sq.yards or equivalent to 83.61 Sq.mtrs, having its Plinth area 800 Sq.fts, With R.C.C., in Survey No.1432 and 1433 (Part-B), Situated at Khalsa Ibrahimpatan Village, Ibrahimpatan Revenue Mandal, Ranga Reddy District, under Ibrahimpatan Municipality and Bounded as follows:- NORTH : Plot No.5 North Part & Balaraju. SOUTH : Plot No.11. EAST : 20'-0' Wide Road. WEST : Plot No.6. towards security for the loan availed by her. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our client will proceed with the transaction.

**Sd/- S.SRINIVAS RAO, A.SUPRIYA**
Advocates
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad-500 039
**Cell: 9948104019**

## PUBLIC NOTICE

The General public is hereby informed that our client Shriram City Union Finance Limited, Himayath nagar Branch Hyderabad, is dealing with financing business in the course of business **SRI BANTU NARSINGA RAO S/O SRI BANTU RAMULU** approached our client for finance and accepted to deposit his title deeds in respect of his property i.e.,

**SCHEDULE OF THE PROPERTY**

All that thepiece and parcel Plot No.22 admeasuring 250-00 Square Yards or 209-00 Square Meters, in Survey No.134/B/^A, in "Sai Krupa Colony", situated at Ravalkole Village, Medchal Mandal, Medchal-Malkajgiri District under Ravalkole Grampanchayat and bounded by: North:- Plot No.32, South:-18'-0" Wide Road, East:- Plot No.23, West:-Plot No.21, security for the loan availed by him, If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our client will proceed with the transaction.

**K. NAGA SRI VALLI**
**Advocate**
HIG-II, Block No.8, Flat No.5, Baghlingampally, Hyderabad-500044, Email: Nagasri_valli@yahoo.co.in
Mobile: **9395375845**

## PUBLIC NOTICE

The General public hereby informed that pertains to **Sri. MANDHINIYA SOHANLAL KUMAVAT S/o Sri. M. GPURMJI,** aged about 51 years, Occ: Business, R/o. H.No.5-11/3, Aliabad Village, Shamirpet Mandal, Medchal-Malkajgiri District, Telangana State, has approached the Alwal Branch, Shriram City Union Finance Ltd., Hyderabad to obtain Loan by put their documents by way of Mortgage in respect of Schedule of Property I & II to secure the future Liability towards loan amount. If any person or person/s having any objection, right, claim, title, interest over the Schedule of property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned to **Sri. MANDHINIYA SOHANLAL KUMAVAT** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY-I**

All that the House No.7-96, On Plot No.33, admeasuring 200 Sq. yds., or equivalent to 167.2 Sq.mts., with a plinth area of 500 Sft. (R.C.C.) in Survey No.614 Part, Situated at Village and Grampanchayath, Lalgadimalakpet, Shamirpet Mandal, Medchal-Malkajgiri District, Regn. Sub-Dist: Shamirpet, Regn. Dist: Medchal-Malkajgiri District, Telangana State and bounded by: North: Survey No.614 Part, South: 15' Wide Road, East: Plot No.32, West: Plot No.34.

**SCHEDULE OF THE PROPERTY-II**

All that the Plot Nos.4 & 5 (including 9' Wide Road), admeasuring 329 Sq.yds., or equivalent to 275.04 Sq.mts., in Survey No.639 Part, Situated at Village and Grampanchayath, Lalgadimalakpet, Shamirpet Mandal, Medchal-Malkajgiri District, Regn. Sub-Dist: Shamirpet, Regn. Dist: Medchal-Malkajgiri District, Telangana State and bounded by: North: Part of Plot Nos.4, 5 & canal, South: Plot No.6 and PWD Road, East: Plot No.3, West: Same Survey No.639 Part.

**Sd/- P. SRINIVASA RAO**
**Advocate**
Flat No.A-14, Ground Floor, Srinivasa Heights Apts, Adarshnagar, Uppal, Hyderabad-39. Cell: **9346666438**

## PUBLIC NOTICE

The General Public hereby informed that **ARIGELA RAMESH S/o DASARADHA RAMAIAH,** aged about 35 years, Occ: Business, R/o 8-3-237/8/4, L.N.Nagar, Near Ganapathy Complex, Khairatabad, Hyderabad., has approached the Shriram City Union Finance Ltd., Kukatpally Branch, Hyderabad., by put his document by way of Mortgage in respect of Schedule of Property to secure the future Liability towards Loan amount. If any person or person's having any objections, Right, claim, title, interest over the Schedule of Property shall approach the undersigned with support of their claim within seven days, failing which the loan amount shall be sanctioned **ARIGELA RAMESH S/o DASARADHA RAMAIAH,** and no claim or no objection of any kind thereafter will be entertained.

**SCHEDULE OF THE PROPERTY**

All that the Farm Land bearing No. 220, admeasuring 563 Sq.Yds, (Ac.0-4.6528 Guntas), in "PRAGATI GREEN VALLEY" in Survey Nos. 410/E/1, 411/A/1, 410/E/2 & 411/A/2, Situated at Chinnamangalaram Village, Chinnamangalaram G.P., Moinabad Mandal, Ranga Reddy District., and bounded by: North: Farm Land No.219 C, South: Farm Land No.220 C, East: Farm Land No.220 A, West: Road.

**Sd/- R. VENKATESHWAR RAO**
**Advocate**
# 5-3-29, Near Ramalayam Temple, Kukatpally, Hyderabad-72.
Cell: **9391093566, 8519985749.**

## ఘట్‌కేసర్‌లో అదనపు కలెక్టర్ అగస్త్య పర్యటన



ఘట్‌కేసర్ మున్సిపల్ కొండాపూర్‌లోని నర్సరీని పరిశీలిస్తున్న మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలో మంగళవారం మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. జిల్లా స్థానిక సంస్థల ఏసీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మొదటి సారిగా ఘట్‌కేసర్ పట్టణాన్ని సందర్శించారు. కొండాపూర్‌లోని హరితహారం నర్సరీని సందర్శించి మొక్కల పెంపకం, నిర్వహణపై ఆరా తీశారు. డంపింగ్‌యార్డును చూసి చెత్త సేకరణ, ఎరువుల తయారీను అడిగి తెలుసుకున్నారు. ఘట్‌కేసర్ కమ్యూనిటీ ఆసుపత్రి ముందు ఉన్న సామూహిక మరుగుదొడ్లను ఏసీ పరిశీలించి నిర్వహణ సక్రమంగా చేయాలని సూచించారు. మున్సిపాలిటీకి రెండు సార్లు స్వచ్ఛసర్వేక్షన్ అవార్డు వచ్చిన విషయమై పరిశుభ్రతపై ఆయన తెలుసుకున్నారు. ఏసీ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, కమీషనర్ పి.వేమనరెడ్డి, బిల్‌కలెక్టర్ శివకుమార్ తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ విద్యుత్ ఉపకేంద్రంలో పరిధిలో బుధవారం 5 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఇ సతీష్‌కుమార్ తెలిపారు. ఘణాపూర్‌లోని 220 కెవి ఉపకేంద్రం టిఎస్‌ట్రాన్స్‌కోలో నిర్వహణ పనుల కారణంగా ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 3:30 గంటల వరకు కరెంట్ ఉండదని తెలిపారు. ఘట్‌కేసర్ 33/11 కెవి, అంకుషాపూర్, సింగపూర్, పోచారం ఉపకేంద్రాల పరిధిలోని ఘట్‌కేసర్ టౌన్, బాలాజీనగర్, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, శివారెడ్డిగూడ, అంకుషాపూర్, ఎదులాబాద్, ఎన్ఎఫ్‌సీనగర్, బొక్కోనిగూడ, మాదారం, సింగపూర్‌టౌన్‌షిప్, రాజీవ్ గృహకల్పకాలనీ, అన్నోజీగూడ, ఐటీ పార్కు, పోచారం, సద్భావనా టౌన్‌షిప్, జోడిమెట్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియో గదారులు గమనించి తమకు సహకరించాలని ఏఇ కోరారు.

## నేడు సాయిబాబా సంస్థానం 5వ వార్షికోత్సవం



శివారెడ్డిగూడలోని షిరిడి సాయిబాబా సంస్థానం దేవస్థానం

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ శివారెడ్డిగూడలోని శ్రీషిరిడి సాయిబాబా సంస్థానంలో బుధవారం దేవస్థానం 5వ వార్షికోత్సం జరుగనుంది. బాబా ఆలయం నిర్మించి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాన్ని అలంకరించి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు దేవాలయ కమిటీ చైర్మన్ కొంతం రాంరెడ్డి తెలిపారు. ఆలయంలో ఉదయం 5:15 గంటలకు కాకడ హారతి, పంచామృత అభిషేకం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం బాబాకు ప్రత్యేక అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు పంచారతి పూజాది కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి వార్షికోత్సవ పూజల్లో పాల్గొనాలని ఆయన కోరారు. ఈసందర్భంగా అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ చైర్మన్ రాంరెడ్డి చెప్పారు.

## శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు

### -జరిగిన అన్నదాన కార్యక్రమం..పాల్గొన్న భక్తజనం





శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగిన దృశ్యం

శ్రీరేణుకా ఎల్లమ్మతల్లిని దర్శించుకుని అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తజనం

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త**
శామీర్‌పేటలోని శ్రీరేణుకా ఎల్లమ్మతల్లి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కార్తీకమాసంను మంగళవారంను పురస్కరించుకుని ఆలయంలో శ్రీరేణుకా ఎల్లమ్మతల్లిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తజనం పెద్ద ఎత్తున విచ్చేసి దర్శించుకున్నారు. ప్రతి మంగళవారం ఆలయం వద్ద దాతల చేయూతతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే శామీర్‌పేట శ్రీరేణుకా ఎల్లమ్మ అమ్మవారికి పలువురు భక్తులు ఒడిబియ్యంను సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద మజీద్‌పూర్ గ్రామానికి చెందిన కవటం కిష్టమ్మ కుటుంబసభ్యులు, గజ్వేల్‌కు చెందిన గంగిశెట్టి శ్రీనివాస్, శామీర్‌పేట మోడీ కాలనీకి చెందిన కేశవరావు దంపతులు వారందరు సంయుక్తంగ కలిసి దాతలుగా నిలిచి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు అందజేత

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
సీఎం సహాయనిధి పేదలకు వరం అని మున్సిపల్ వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎడబ్ల్యుఎస్‌కాలనీకు చెందిన సల్మాబేగంకు మంగళవారం ఆయన రూ.45,000ల సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఇటీవల ఆమె అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా బిల్లు ఎక్కువ కావడంతో మంత్రి మల్లారెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి పథకానికి ధరఖాస్తు చేసుకుంది. ఈమేరకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.45,000లు మంజూరు కాగా వైస్ చైర్మన్ మాధవరెడ్డి లబ్దిదారు సల్మాబేగం ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ప్రభుత్వం పేదలకు పలు రకాలుగా ఆర్థిక ప్రయోజనం కల్గించి అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట నాయకులు పలుగుల ప్రణయ్‌రెడ్డి ఉన్నారు.



సల్మాబేగంకు సీఎం ఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ మాధవరెడ్డి

## తెలంగాణలో సంక్షేమ పథకాలు అద్భుతం

-మోత్కూపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శుభోదయం

-టిఆర్ఎస్ పార్టీలో చేరిన యువకులు



సీసీరోడ్డు శిలాఫల్కాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సర్పంచ్, ఎంపీపీ, జెడ్పిటీసి



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న యువకులు

**మొయినాబాద్, నవంబర్22, ప్రభాతవార్త :**
తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అద్భుతంగా నడుస్తున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ లో సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసారన్నారు. మంగళవారం ఎమ్మెల్యే యాదయ్య మొయినాబాద్ మండలంలోని పలుగ్రామాల్లో శుభోదయం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ప్రతి వార్డును తిరిగి సమస్యలను తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి రైతు బంధు వస్తుందా అని అడిగి తెలుసుకోని, ఆసరా ఫించన్ దారుల వద్దకు వెళ్లి ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గ్రామంలోని సీసీరోడ్డును ప్రారంభించారు. మోత్కూపల్లి గ్రామంలోఎమ్మెల్యే ఆధ్వర్యంలో యువకులు ఫిరంగి నర్సింగ్‌రావు, ఇరుకోళ్ల నవీన్, వెంకటేష్, రాజు, తైదల మహేందర్ తధితరులు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలోలేని సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి కేసిఆర్ అద్భుతంగా ప్రవేశపెట్టారని, రాష్ట్రంలో మధ్యవర్తుల పెత్తనాలు లేకుండా నేరుగా రైతుల ఖాతాలోనే నగదు జమచేస్తున్నారని అన్నారు, ప్రతి ఒక్కరికి ఆర్థికంగా సహాయం అందించే పథకాలు ముఖ్యమంత్రి కేసిఆర్ చొరవతోనే అద్భుతంగా నడుస్తున్నాయని గుర్తుచేశారు, టీఆర్ఎస్ పరిపాలన అభివృద్ధితోనే మిగితా పార్టీల నాయకులు టీఆర్ఎస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నారు. గ్రామంలోని సమస్యలను తెలుసుకోని త్వరలోనే ప్రతి పనికి పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామ్‌చెందర్, జెడ్పిటీసి కాలే శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జేవంత్, సర్దానగర్ మార్కెట్ వైస్ చైర్మెన్ రహూఫ్, మొయినాబాద్ టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు పూసల పరమేష్, ఉపాధ్యాక్షులు సునీల్, వార్డుమెంబర్ కిరణ్, పాల్గొన్నారు.

## జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు

**నాగారం నవంబర్22,ప్రభాతవార్త :**
ప్రతి ఒక్క విద్యార్థి తన శక్తి సామర్థ్యాలకు అనుగుణంగా వారు ఆసక్తిగల రంగాలను ఎంచుకుని,వారు ఆ రంగంలో ఉన్నత స్థితికి చేరుకోవాలనే స్ఫూర్తిని కల్పించడమే చెకుముకి టాలెంట్ టెస్ట్ ముఖ్యఉద్దేశమని జన విజ్ఞాన వేదిక మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ అన్నారు.జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కీసర మండల పరిధిలో గల ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నాగారం ప్రభుత్వ పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు.చెకుముకి టాలెంట్ టెస్ట్ స్కూల్ స్థాయిలో ఈ నెల 18న నిర్వహించి,అందులో ప్రతిభ కనబరిచిన 8,9,10వ .తరగతి విద్యార్థులను మండల స్థాయికి ఎంపిక చేయగా మంగళవారం విద్యార్థులను ఒక టీంగా ఏర్పాటు చేసి,మండల స్థాయి పరీక్షను నిర్వహించారు.ముందుగా నాగారం ప్రభుత్వ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ప్రమీల సంబరాలల్లో భాగంగా మండల్ లెవెల్ మండల స్థాయి పరీక్ష ప్రశ్నపత్రాలను విడుదల చేసి,విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.అనంతరం జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ...టాలెంట్ టెస్టులు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వారిలో దాగివున్న ప్రజ్ఞా పాటవాలను వెలికి తీయడానికి ఉపయోపడుతుందని వారు తెలియజేశారు.అనంతరం కీసర మండల అధ్యక్షుడు పటేల్ నర్సింహులు,ప్రధాన కార్యదర్శి ఎంఎల్ చౌదరిలు మాట్లాడుతూ...గత 33 సంవత్సరాల నుండి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని కీసర మండల పరిధిలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు స్కూల్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల చేత మండల స్థాయి టెస్ట్‌కు ఎంపిక చేసి ,మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పరీక్షను ఈ నెల 28న నిర్వహిస్తున్నామని తెలిపారు.జిల్లాస్థాయి పరీక్షకు నాగారం సెరినిటీ పాఠశాల,సెయింట్ జోసఫ్ దమ్మాయిగూడ ,నాగారం ప్రభుత్వ పాఠశాల కీసర ప్రభుత్వ పాఠశాల చేర్యాల ప్రభుత్వ పాఠశాల జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు (ఫిజికల్ డైరెక్టర్)కీసర జోనల్ ఇంచార్జ్ యాదయ్య,చేర్యాల ఫీజికల్ సైన్స్ ఉపాధ్యాయులు రామచందర్,జన విజ్ఞాన వేదిక కీసర మండల ప్రధాన కార్యదర్శి ఎంఎల్ చౌదరి నాగారం పాఠశాల ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



## ఎంపిపి జాతీయ రహదారి పనుల పరిశీలన



చౌదరిగూడలో జాతీయరహదారి వద్ద నిర్మిస్తున్న కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మండలంలో జరుగుతున్న జాతీయరహదారి-163 విస్తరణ పనులను మంగళవారం ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. చౌదరిగూడ పంచాయతీ పరిధిలోని జోడిమెట్ల విజయపురి కాలనీ ఎదురుగా నిర్మిస్తున్న కల్వర్టును ఆయన పరిశీలించి పనుల ప్రగతిని తెలుసుకున్నారు. సోమవారం మంత్రి మల్లారెడ్డి నారపల్లి-ఎదులాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి అనవసర విమర్శలు చేశారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఆర్ఎఫ్ నిధులు రూ.15 కోట్ల చేపట్టనున్న రోడ్డుకు భూమిపూజ చేసిన మంత్రి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఎన్ఆర్ఈజిఎస్‌తో గ్రామాల్లో రోడ్లు, వైకుంఠధామాలు, డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, రైతువేదికలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఉపాధి హామీ పథకం కూలీల ద్వారా సహకారం అందిస్తుండగా మంత్రి మరచిపోయి అర్ధరహిత విమర్శలు చేయడం తగదన్నారు. కేంద్ర నిధులతో వేసిన శిలాఫలకం వద్ద అధికారిక కార్యక్రమాన్ని టిఆర్ఎస్ కార్యక్రమం లాగా మార్చి జైకేసీఆర్, జైకెటిఆర్, జైమల్లన్న అంటూ నినాదాలు చేయడం అవివేకమని ఆయన ఎద్దేవా చేశారు. హెచ్ఎండిఏ నుంచి గ్రామాలకు ఎల్ఆర్ఎస్ నిధులు విడుదల చేయించడంలో మంత్రి మల్లారెడ్డి విఫలమయ్యారని ప్రతిరోజు కేసీఆర్‌కు భజన చేస్తూ అసమర్థ మంత్రిగా పేరు తెచ్చుకున్నారని ఎంపిపి విమర్శించారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ కొమ్మిడి దామోదర్‌రెడ్డి, నాయకులు బసవరాజుగౌడ్, శ్రీనివాస్ ఉన్నారు.

## భూ పోరాటాలను ఉధృతం చేయాలి




మహసభలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

-వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు

**కొడంగల్,నవంబర్ 22ప్రభాతవార్త**
వికారాబాద్ జిల్లాలో ఉన్నటువంటి ప్రభుత్వ భూములను పేదలకు పంచేదాకా వ్యవసాయ కార్మిక సంఘం అద్వర్యంలో భూ పోరాటాలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభ సందర్భంగా మంగళవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం నుంచి పట్టణ శివారులోని కేఎస్‌వీ ఫంక్షన్‌హాల్ వరకు ర్యాలీగా తరలివెళ్ళారు. అనంతరం అక్కడే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అద్యక్షులు యు.బుగ్గప్ప జెండాను అవిష్కరించి మహసభ నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.మల్లేష్ ప్రారంభ ఉపన్యాసంతో మహసభను ప్రారంభించారు.అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతు రానున్న రోజుల్లో ప్రభుత్వ భూములు ఎక్కడున్నా జెండాలు పాతి అక్రమించుకొని పేదలకు పంపిణీ చేస్తామన్నారు.కొడంగల్‌లో 1156,పరిగిలో 80 ఎకరాలు, తాండూర్,వికారాబాద్ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయన్నారు.అలాగే అరర్హులైన పేదలందరికి 120 గజాల ఇంటి స్దలాలు ఇవ్వడం, సొంత ఇంటి స్దలాలు ఉన్న వారికి ప్రభుత్వం లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.వలసల నివారణ కోసం అమలు చేస్తున్న ఉపాధిహామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని,రోజు కూలీ రూ.600 చోప్పున చెల్లిస్తు 200 పని దినాలకు పెంచాలన్నారు.పేదలకు ఇచ్చిన హామీలు డబుల్‌బెడ్ రూం,మూడు ఎకరాల భూమి,రైతు రుణమాఫీ,అర్హులైన పేదలందరికి దళిత బంధు పథకం,నిరుద్యోగ భృతి తదితర హామీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మికులకు కనీస వేతన చట్టాన్ని సవరణ చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీ అందించాలన్నారు.అనంతరం మహసభలో 15 మందితో కూడిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.ఏడు మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.కాగా డిసెంబర్ 29,30,31 తేదిల్లో ఖమ్మం జిల్లాలో జరుగనున్న రాష్ట్ర మహసభలకు 11 మంది డెలిగేట్స్‌ను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య,బుస్స చంద్రయ్య,సీఐటీయూ జిల్లా అద్యక్షులు శ్రీనివాస్,కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మహిపాల్,మల్కయ్య,ఎన్‌పీఆర్‌డీ జిల్లా కార్యదర్శి దశరత్, కొత్తూర్ చంద్రయ్య, సత్తయ్య, మల్లప్ప,శేఖర్, రఘురామ్, శ్రీనివాస్, రమేష్,చందు, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.ఇదిలావుండగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహసభను పురస్కరించుకొని కొడంగల్ అంబేద్కర్ చౌరస్తా ప్రాంతం ఎరుపు రంగు జెండాలతో ఎరుపు మయంగా మారింది.

## వృద్ధురాలిది ఆత్మహత్యా.. లేక హత్య...?

- వృద్ధురాలి మృతిపై గ్రామస్థుల అనుమానం

- ఘటన స్థలంలో కిరోసిన్ బాటిల్‌ను సేకరించిన పోలీసులు

**బషీరాబాద్,నవంబర్ 22,ప్రభాతవార్త:** వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బషీరాబాద్ మండల పరిధిలోని మైల్వార్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యా చరణ్ రెడ్డి,డాక్టర్ సయ్యద్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు.ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ముక్త శాంతమ్మ(67) సోమవారం రాత్రి సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్య చేసుకు న్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.మృతురాలి కొడుకు నర్సిములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నామన్నారు.మృతురాలు శాంతమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి పెద్ద కొడుకు హైదరాబాద్‌లో,చిన్న కొడుకు కర్ణాటకలో నివాసం ఉంటున్నారు.గత ఏడాది క్రితం శాంతమ్మ భర్త ముక్త వీరయ్య మరణించటంతో నాటి నుండి ఒంటరి జీవితం గడపలేక కుటుంబ సభ్యులతో చచ్చిపోతానని పదే పదే చెబుతుండేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.తల్లి బాగోగులు పట్టించుకోకపోవటంతో వృద్ధురాలు మనస్థాపానికి గురై సోమవారం రాత్రి ఈ ఆఘయాత్యానికి ఒడిగట్టి ఉంటుందని ఎస్ఐ విలేకరలతో పేర్కొన్నారు. కాగా వృద్ధురాలి మృతిపై ఎలాంటి అనుమానం లేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

**గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి:** శాంతమ్మ ఇంటి పక్కన ఉంటున్న ఓ కుటుంబం సోమవారం సాయంత్రం ఆమెతో గొడవ పడినట్లు తెలిపారు. గొడవ కారణంగా ఆమెను హతమార్చి ఆపై నిప్పు అంటించి ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేశారు.వృద్ధురాలు ఆత్మహత్య చేసుకోవటం ఏమిటని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**కిరోసిన్ ఎక్కడిది...?**వృద్ధురాలు ఆత్మహత్యకు కిరోసిన్ వాడినట్లు ఎస్ఐ పేర్కొనటంతో గ్రామస్థులు ఈ విషయంపై చర్చించుకున్నారు.వృద్ధురాలి మృతిపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వృద్ధురాలు గడప దాటి బయటికి వెళ్లలేని స్థితిలో ఉందన్నారు.వృద్ధురాలిని ఎవరో హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.కిరోసిన్ సరఫరాపై బషీరాబాద్ రెవెన్యూ అధికారులకు వివరణ కోరాగా తెలంగాణలో గత రెండు సంవత్సరాల నుండి కిరోసిన్ సరఫరా నిలిపివేసినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.

## చిల్కూర్ చెరువులో పడి వ్యక్తి మృతి

**మొయినాబాద్, నవంబర్ 22, ప్రభాతవార్త :**
మొయినాబాద్ మండలంలోని చిల్కూర్ గ్రామానికి చెందిన గునుగుర్తి మహేష్ (24) చిల్కూర్ కుంటలో పడి మృతి చెందాడు, చిల్కూర్ గ్రామానికి చెందిన గునుగుర్తి జంగయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు వివరాలు వెల్లడించారు, వారి కోడుకు మహేష్ చిల్కూర్ బాలాజీ టెంపుల్ వద్ద కొబ్బరికాయలు అమ్ముతు జీవనం కోనసాగించేవాడని, అతను తాగుడుకు బానిస అయిపోయి రోజు తాగుతూండేవాడని అన్నారు, ఆదివారం అందాజ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికి తనకోడుకు మహేష్ తన కూతురు దగ్గరికి వెళ్తానని చెప్పి ఇంట్లో నుండి వెళ్లి పోయాడున్నారు, తిరిగి ఇంటికి రాకపోవడంతో తేది 21,11,2022 నాడు వారి కూతురికి ఫోన్ చేసి తమ్ముడు వచ్చాడా అని అడగగా రాలేదని తెలుపడంతో బంధువుల దగ్గర మరియు ఫ్రెండ్స్ దగ్గర ఆచూకీ గురించి అడుగగా ఎటువంటి సమాచారం అభించ లేదన్నారు, 22,11,2022 నాడు మధ్యాహ్నం 2 గంటలకు సమయంలో గ్రామస్తుల ద్వార నా కోడుకు మహేష్ మా ఊరి కుంటలో పడి చనిపోయాడని తెలిపారు. అతను తాగిన మైకంలో కుంటలో పడి చనిపోయి ఉంటాడని అతని మరణం పై మాకు ఎలాంటి ఫిర్యాదులు లేవని తెలిపారు, మహేష్ తండ్రి జంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు,

## రోడ్ల మరమ్మతు చేసే వరకు ఆందోళన చేస్తాం

- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

**కొందుర్గు, నవంబర్ 22, (ప్రభాతవార్త) :**
ధ్వసమైన రోడ్లన్నింటిని మరమ్మత్తు చేసి అవసరమున్న చోట వంతెనేలు నిర్మించేంత వరకు ఆందోళన చేస్తామని కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గం ఇంఛార్జీ వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టేకులపల్లి ఉత్తరాశిపల్లి, బైరంపల్లి, మహాదేవ్‌పూర్ గ్రామాల మీదుగా పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి రాంచంద్రాపూర్ చౌరస్తా వరకు పాదయాత్ర చేశారు. అనంతరం అక్కడే ధర్నా, రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ రోడ్లన్ని అస్తవ్యస్తంగా మారుతుండటంతో ప్రజలు, ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్న పాలకులు పట్టించుకోకపోవడము విడ్డూరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ ఆరుణమ్మ నాయకులు బోరిగ నరేందర్, ఎన్.చంద్రశేఖర్, అంజిరెడ్డి, మైపాల్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, బుర్రగంజి శ్రీను, మల్లేష్‌గౌడ్, భ్యాగరి రవి, చిల్కమర్రి నర్సింహ్మా, గాలి శ్రీను, సత్తయ్యగౌడ్, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

## మామిడి తోటల్లో ఎండు తెగులు

### -మందులు పిచికారి చేయాలి

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లాలోని మామిడితోటల్లో ఇటీవల కాలంలో ఎండు తెగులు రోగాన్ని ఎక్కువగా గుర్తించటం జరిగిందని మేడ్చల్ జిల్లా ఉద్యానవన,పట్టుపరిశ్రమ అధికారి పేర్కొన్నారు. ఎంగు తెగులు డైబ్యాక్ అని కూడ అంటారని అన్నారు. బోట్రాడిపిలోడియ థియోబ్రోమే అన్న శిలీంద్ర వల్ల అక్టోబర్,నవంబరు నెలల్లో ఎక్కువగా వస్తుందన్నారు. దీనిని నివారించటానికి మాంకోజెబ్ లేదా కాపర్ అక్సిక్లోరైడ్ 50శాతం కలిగిన శిలింధ్ర నాశిని బ్లిటక్స్,సాఫ్ 2 గ్రాములు ల్యండ సైహాలోత్రిన్‌ను కలిగిన పురుగు మందు (కరాటే లేదా అలిక) 1మిల్లీ లీడర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు జిల్లా అధికారి సూచించారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ

- అధికారులు, నేతల హామీతో వెనక్కి తగ్గిన కార్మికులు



కార్మికులతో సమ్మె విరమింపజేస్తున్న నేతలు.

**తాండూరు, నవంబరు 22, ప్రభాతవార్త:**
ప్రభుత్వం 11వ పీఆర్సీ కింద పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని గత 18 రోజులుగా తాండూరులో మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మెను మంగళవారం విరమించారు. అధికారులు, నేతల హామీతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు ప్రకటించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల దీప, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ కౌన్సిలర్లు సోమశేఖర్, మంకాల్ రాఘవేందర్, ప్రభాకర్‌గౌడ్, సంఘీత ఠాగూర్ తదితరులు కార్మికులతో మాట్లాడి సమ్మె విరమింపజేశారు. గత 18 రోజులుగా కార్మికుల సమ్మెతో మున్సిపల్ పరిధిలోని వార్డులలో పారిశుధ్యం అస్థవ్యస్థంగా మారిందని, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డితో మాట్లాడటం జరిగిందని, డిసెంబరు చివరి వరకు పీఆర్సీతో పాటు పెంచిన వేతనాలను అమలుపర్చేలా చర్యలు తీసుకుంటామని హామి ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు పేర్కొన్నారు.

## పేదలకు డబుల్‌బెడ్‌రూమ్‌ఇండ్లు మంజూరు చేయాలని ధర్నా



ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

**ఘట్‌కేసర్, నవంబర్ 22, ప్రభాతవార్త:**
పేదల ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు, డబుల్ బెడ్‌రూమ్ మంజూరు చేస్తామని వాగ్దానం చేసిన ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్.సబిత డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ తహసీల్ కార్యాలయం ముందు మంగళవారం తెలంగాణ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సబిత మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి, ఇండ్లు లేని వారికి స్థలం ఇచ్చి డబుల్‌బెడ్‌రూమ్ నిర్మిస్తామని సర్కారు హామీ ఇచ్చి నెరవేర్చకుండా జాప్యం చేస్తుందన్నారు. ఇంటి వద్ద స్థలం ఉన్న పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని, గుడిశెలో ఉంటున్న పేదలను గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ధరఖాస్తు చేసుకొని ఎదురుచూస్తున్నారని అర్హులకు పారదర్శంగా ఇండ్లు ఇవ్వాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ విజయలక్ష్మికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి జి.నాగమణి, ఎన్‌పిఆర్‌డి మండల అధ్యక్షురాలు నీరజరెడ్డి, ప్రధానకార్యదర్శి కె.చంద్రమోహన్, కెవిపిఎస్ మండల ఉపాధ్యక్షులు జలగం పరమేశ్, సహాయకార్యదర్శి ఆర్.రమేశ్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి దాసు, గ్రామపంచాయతీ యూనియన్ మండల అధ్యక్షులు వై.చంద్రమౌళీ, సహాయకార్యదర్శి కనకరాజు, పి.రాజయ్య, దేవయ్య, టి.లక్షణ్, ఎ.బాలయ్య, చిన్న కృష్ణ, ఆర్.జంగయ్య, కె.బాలయ్య, టి.జంగయ్య, డి.పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న మహేంద్ర జీప్‌వాహనం

### -డ్రైవర్‌తో పాటు ఆరు మంది కూలీలకు తీవ్ర గాయాలు

**శామీర్‌పేట, నవంబరు 22, ప్రభాతవార్త :** పోతారం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడు మందికి తీవ్ర గాయాలు అయినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం ఉదయం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మూడుచింతలపల్లి మండలం పోతారం గ్రామ సమీపంలో కూలీలతో వస్తున్న ఆటోను మహేంధ్ర జీప్‌వాహనం అతివేగంగ వస్తూ ఆటోను ఢీకొనటంతో ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు ఆరుమంది కూలీలకు తీవ్ర గాయాలు అయినట్లు తెలిపారు. శామీర్‌పేట మండలం తుర్కపల్లిలోని కంపెనీలో కూలి పనికోసం కూలీలు ఆటోలోవెళ్తుండగ ప్రమాదం జరగటంతో వెంటనే తీవ్రగాయాలకు గురైన ఏడు మందిని ఆర్‌విఎం హాస్పిటల్‌కు తరలించటం జరిగిందన్నారు. అయితే కూలీలు యాదాద్రి జిల్లా బొమ్మలరామారం మండలం రామలింగంపల్లి గ్రామానికి చెందిన వారు ఆటోలో తుర్కపల్లిలోని కంపెనీకి కూలి పని కోసం వెళ్తుండగ పోతారం గ్రామ సమీపంలో తుర్కపల్లి వైపున నుంచి వస్తున్న మహేంద్రజీప్ వాహనం ఆటోను ఢీకొనటంతో ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు కూలీలకు తీవ్రగాయాలు అయినట్లు తెలిపారు. పలువురికి రక్తగాయాలు కావటంతో వెంటనే ఆర్‌విఎం హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.